RNI
TEL TEL / 2023/ 84132

అక్షర సవాల్

సామాన్యుడు ప్రశ్నించే గొంతుక



తాజ్‌ను సందర్శించవచ్చు.. పాక్ మంత్రికి అనుమతి

ఇంటర్నెట్ డెస్క్: ఆగ్రాలోని తాజ్ మహల్‌ను సందర్శించేందుకు పాకిస్తాన్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే, ఢిల్లీలోని నిజాముద్దీన్ దర్గాను సందర్శించేందుకు మాత్రం అనుమతి నిరాకరించింది. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) నాగరికతల సంభాషణల వేదిక సదస్సులో పాల్గొనేందుకు మాలిక్ భారత్‌కు వచ్చిన విషయం తెలిసిందే. తాజ్ మహల్‌తో పాటు నిజాముద్దీన్ దర్గాను సందర్శించేందుకు అంతకుముందు ఆయన అనుమతి కోరగా ప్రభుత్వం నిరాకరించింది. ప్రస్తుతం తాజ్‌ను సందర్శించేందుకు మాత్రమే ఆయనకు అనుమతి ఇచ్చింది. అలాగే హుమాయున్ సమాధి, ఢిల్లీ హాట్ సహా ఢిల్లీలోని వివిధ చారిత్రక ప్రాంతాల సందర్శనకూ ఆయనకు క్లియరెన్స్ లభించింది. దీంతో మాలిక్ నేతృత్వంలోని బృందం ఆ ప్రాంతాలను సందర్శించనుంది.

ఒకరికొకరం సందర్శించుకుంటూనే ఉంటాం

గతంలో సింధూ జలాల ఒప్పందంపై కామెంట్లు చేసిన తర్వాత ఎస్‌సీఓ నాగరికతల సంభాషణల సదస్సులో పాల్గొనేందుకు మాలిక్.. భారత్ వచ్చారు. గత మూడేళ్లలో ఒక పాకిస్తానీ మంత్రి మన దేశాన్ని సందర్శించడం ఇదే మొదటిసారి. శుక్రవారం సదస్సు ప్రారంభమైన తర్వాత మీడియాతో ఆయన మాట్లాడారు. శాంతి, భద్రతను ముందుకు తీసుకెళ్లే విషయంలో చేసే అన్ని ప్రయత్నాలకు పాక్ మద్దతు ఇస్తుందని ఆయన చెప్పారు.

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు
ప్రక్రియ వేగవంతం



మంత్రి పొన్నం

హైదరాబాద్:మినిస్టర్ క్వార్టర్స్‌లోని మంత్రి పొన్నం ప్రభాకర్ నివాసంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది.కమిటీ చైర్మన్ కే. కేశవరావు , ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం , మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ , మోతే శోభన్ రెడ్డి , శ్యాం మోహన్ సమావేశంలో పాల్గొన్నారు.మంత్రి పొన్నం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కోసం ఇప్పటికే వివిధ యూనివర్సిటీల ఉద్యమకారులు, కళాకారులు, సబ్బండ వర్గాలతో జరిపిన సంప్రదింపులు, ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలు, పనుల పురోగతిని సమీక్షించాం. గుర్తింపు ప్రక్రియను - మిగతా3లో

పార్టీ లైన్ దాటితే
చర్యలు తప్పవు..

రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై మహేశ్ గౌడ్ స్పందన

హైదరాబాద్, నవంబరు 21:కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఇటీవల సొంత పార్టీపై చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. పార్టీ లైన్ దాటి మాట్లాడే నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అంశాన్ని అధిష్ఠానం చూసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, పార్టీ అంతర్గత వ్యవహారాలపై ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు.“కాంగ్రెస్‌లో ప్రజాస్వామ్యం కొంచెం ఎక్కువైంది. పార్టీ లైన్ దాటి మాట్లాడే వారిపై క్రమశిక్షణ చర్యల గురించి ఏఐసీసీ చూసుకుంటుంది. ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలను ఏఐసీసీ నిశితంగా పరిశీలిస్తోంది” అని తెలిపారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీ బలంగా ఉందంటూ చేసిన వ్యాఖ్యలు, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రభుత్వ స్థిరత్వం, పనితీరుపై మాట్లాడిన అంశాలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో పీసీసీ చీఫ్ ఈ వివరణ ఇచ్చారు.ఈ సందర్భంగా క్రమశిక్షణ ప్రాధాన్యతను వివరిస్తూ ఆయన గత ఉదంతాన్ని గుర్తుచేశారు. “గతంలో కొండా సురేఖ విషయంలోనూ మొదటిసారే చర్యలు తీసుకోలేదు. పలుమార్లు హెచ్చరించాం.



తీరు మారకపోవడంతోనే చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. క్రమశిక్షణ ముందు అందరూ సమానమే. దేనికైనా సరైన సమయం ఉంటుంది” అని స్పష్టం చేశారు. పార్టీలో ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలని, ఎవరైనా పరిధి దాటి ప్రవర్తిస్తే అధిష్ఠానం తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు.టీవల ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చేసిన వీడియోలు వైరల్ అయ్యాయి. తన నియోజకవర్గానికి - మిగతా3లో



తెలంగాణకు సఫ్రాన్
భారీ పెట్టుబడి..

రూ.4,000 కోట్లతో విస్తరణకు ప్లాన్

హైదరాబాద్, నవంబరు 21: ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ ఏరోస్పేస్ సంస్థ సఫ్రాన్ తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతోంది. రాష్ట్రంలో సుమారు రూ.4,000 కోట్ల పెట్టుబడితో తయారీ కార్యకలాపాలను విస్తరించేందుకు ప్రతిపాదించినట్లు సమాచారం. ఫ్రాన్స్‌లోని సఫ్రాన్ తయారీ కేంద్రాన్ని సందర్శించిన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సంస్థ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలు, కొత్త తయారీ యూనిట్ల ఏర్పాటు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. ఇప్పటికే హైదరాబాద్‌లో పలు తయారీ యూనిట్లను నిర్వహిస్తున్న సఫ్రాన్.. లీప్ విమాన ఇంజిన్ల విడిభాగాల తయారీలో కీలక కార్యకలాపాలు కొనసాగిస్తోంది. అంతేకాకుండా ప్రపంచంలోనే అతిపెద్ద లీప్ ఎంఆర్ఓ కేంద్రాల్లో ఒకదాన్ని - మిగతా3లో

మోదీ, షా, ఒవైసీది
ఒకటే జట్టు...

అసదుద్దీన్‌పై తొలిసారి రేవంత్ ఫైర్

- మోదీ, షా, ఒవైసీ కలిసి మత రాజకీయాలు చేస్తున్నారన్న ముఖ్యమంత్రి
- దమ్ముంటే హైదరాబాద్ నుంచి పోటీ చేసి గెలవాలని అమిత్ షాకు సవాల్
- తెలంగాణలో బీజేపీకి బలం లేదన్న రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ :ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీపై నేరుగా విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు ఒవైసీ కూడా మత రాజకీయాలు చేస్తూ పరస్పరం రాజకీయ లబ్ధి పొందుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఈ ముగ్గురి రాజకీయ వైరుధ్యం కేవలం ప్రజలను మభ్యపెట్టడానికేనని పేర్కొన్నారు.మోదీ, అమిత్ షా ఒకవైపు హిందువులను, మరోవైపు అసదుద్దీన్ ఒవైసీ ముస్లింలను ఏకం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ మతపరమైన చీలిక ద్వారా మూడు పార్టీలూ ప్రయోజనం పొందుతున్నాయని రేవంత్ విశ్లేషించారు. 70 ఏళ్లుగా కాంగ్రెస్ మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలు చేసిందన్న బీజేపీ ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. తమ పార్టీ మతం, కులంతో సంబంధం లేకుండా సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని - మిగతా3లో



నితీశ్ సేతు బ్రిడ్జిని ప్రారంభించిన ప్రధాని మోదీ

ఇంటర్నెట్ డెస్క్: ప్రధాని నరేంద్ర మోదీ బిహార్‌లోని వైశాలి జిల్లాలో కచ్చీ దర్గా-రాఘవ్‌పూర్-బిదుపుర్ బ్రిడ్జిని ప్రారంభించారు. ఆరు లేన్లు ఉన్న ఈ బ్రిడ్జికి బిహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్ గౌరవార్థం 'నితీశ్ సేతు' అని పేరుపెట్టారు. బిహార్ గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్, ముఖ్యమంత్రి సమ్రాట్ చౌధరి, కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్, డిప్యూటీ సీఎం విజయ్ కుమార్ చౌధరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బ్రిడ్జిని ప్రారంభించాక వారంతా మోదీతో కలిసి నడిచారు.



రూ.4,280 కోట్లతో నిర్మాణం

నితీశ్ సేతు బ్రిడ్జిని రూ.4,280 కోట్లతో గంగా నదిపై నిర్మించారు. పూర్తిగా కేబుళ్లతో దీనిని కట్టారు. దీని పొడవు 19.7 కిలోమీటర్లు. పట్నా జిల్లాలోని జాతీయ రహదారి 22పై ఉన్న కచ్చీ దర్గాను వైశాలి జిల్లాలోని జాతీయ రహదారి 322పై ఉన్న బిదుపుర్‌తో ఈ బ్రిడ్జి కలుపుతుంది. అంటే పట్నా, వైశాలిని ఇది అనుసంధానిస్తుంది. ఇందులో 9.7 కిలోమీటర్లు మెయిన్ బ్రిడ్జి కాగా.. 10 కిలోమీటర్లు అప్రోచ్ రోడ్లు ఉన్నాయి. ఈ బ్రిడ్జితో ప్రయాణ సమయం 20 నుంచి 25 నిమిషాలకు తగ్గుతుంది. ప్రముఖ సంస్థ లార్సెన్ అండ్ ట్యూబ్రో, దక్షిణ కొరియా కంపెనీ డైవూ కలిసి ఈ బ్రిడ్జిని నిర్మించాయి.

నితీశ్‌ను కలవడం ఆనందంగా ఉంది: మోదీ

నితీశ్ సేతు బ్రిడ్జిని ప్రారంభించేందుకు పట్నా ఎయిర్‌పోర్టు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీని బిహార్ మాజీ సీఎం నితీశ్ కుమార్ రిసీవ్ చేసుకున్నారు. నితీశ్‌ను కలవడం తనకు ఆనందంగా ఉందని మోదీ అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఫొటోలు షేర్ చేశారు.

కనీసం సెక్రటరీనే లేడు..
నువ్వేం ఇండస్ట్రీలను ఆకర్షిస్తావ్..

రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్

ఖైరతాబాద్‌లో మన పార్టీ మీద గెలిచి పార్టీ మారిన దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేసింది.. రేపో మాపో ఎన్నికలు రాబోతున్నాయి.. ఈ సమయంలో ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ దుకాణం ఖాళీ అవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు.. ఇది బీఆర్ఎస్ గెలుపునకు ఒక గొప్ప సూచిక అని అన్నారు సోమాజిగూడ డివిజన్ యువ నాయకుడు మహేశ్ యాదవ్ ఆధ్వర్యంలో త్రినాథ్‌తోపాటు పలువురు కార్యకర్తలు మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి హరీశ్ రావు గులాబీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. ఈ మధ్య రాష్ట్రంలో ఎవరూ సర్వే చేయించినా.. రేవంత్ రెడ్డి చేయించుకున్నా.. ఏజెన్సీలు చేసినా.. ఏ పార్టీ సర్వే చేసినా అన్ని సర్వేల్లో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని వస్తుందన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి



కావాలని రాష్ట్రంలోని అన్ని సర్వేలు చెబుతున్నాయన్నారు. ఇండస్ట్రీలను ఆకర్షిస్తా.. నేను భారత్ సమ్మిట్‌ను పెడతా అంటుండు రేవంత్ రెడ్డి.. అసలు ఈ రాష్ట్రానికి రెండేళ్ల నుంచి పరిశ్రమల కార్యదర్శే లేడు. ఐటీ శాఖకు సెక్రటరీనే లేడు.. నీ బొంద నువ్వేం ఇండస్ట్రీలను ఆకర్షిస్తావ్.. - మిగతా3లో

కొత్తగూడెం వర్శిటీని ప్రపంచంలోనే టాప్-5లో నిలుపుతాం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 21: కొత్తగూడెం మైనింగ్ కాలేజ్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యూనివర్శిటీలో స్వర్ణోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.మైనింగ్ కాలేజ్ ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా యూనివర్శిటీలో జాతీయ స్థాయిలో సాంకేతిక సదస్సు ఏర్పాటు చేశారు. సింగరేణి, ఓయూ, కేయూ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సును పూర్వ విద్యార్థులు – విద్యాసంస్థలు – పరిశ్రమల భాగస్వామ్యంతో నిర్వహించారు. ఈ సదస్సులో మంత్రి తుమ్మల ప్రసంగించారు. మైనింగ్ ఇంజనీరింగ్‌లో ఎంతో మంది నిపుణులు కొత్తగూడెం కాలేజ్ నుంచి వచ్చినవారే అని గుర్తుచేశారు. కొత్తగూడెంలో చదివిన పూర్వ విద్యార్థులు, విదేశాల్లో విధులు నిర్వర్తిస్తున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు.విద్యారంగంలో తెలంగాణ ఖ్యాతి పెరిగేలా కొత్తగూడెం ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. దేశంలోనే తొలి ఎర్త్ సైన్స్ యూనివర్శిటీని ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేశామన్నారు. గిరిజన ప్రాంతంలోనే ఈ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలనే ఆలోచనను సీఎం రేవంత్ రెడ్డి చాలా ప్రోత్సహించారని.. అందుకే ఈ యూనివర్శిటీని ఖమ్మంలో ఏర్పాటు చేశామని తెలిపారు.ఖనిజాల కాణాచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని శాస్త్రీయంగా ఏర్పాటు చేశామని మంత్రి తుమ్మల తెలిపారు. మౌలిక సదుపాయాలు, ఆధునిక పరిశోధనల కోసం అత్యాధునిక ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రపంచంలోనే టాప్ ఫైవ్ ఎర్త్ సైన్స్ యూనివర్శిటీల్లో కొత్తగూడెం యూనివర్శిటీని నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.



సంపాదకీయం

అసంపూర్తి చరిత్రతో
ఎ జర్నీ ఆఫ్ లవ్

ఒక వ్యక్తి ఆత్మకథ కేవలం వారి వ్యక్తిగత జ్ఞాపకాల సేకరణ కాదు. అది వారి అంతరాత్మకు అద్దం పట్టే పత్రం. కానీ, కొందరి జ్ఞాపకాలు సానుభూతి కోరుకునే నాటకాలుగా మారినప్పుడు, చరిత్ర వాటిని ప్రశ్నించక తప్పదు."భారత రాజకీయాల్లో అగ్రనాయకుల ఆత్మకథలు కేవలం వారి గతాన్ని నెమరువేసుకోవడానికి మాత్రమే కాకుండా, క్షేత్రస్థాయిలో కోల్పోయిన ప్రజాదరణను తిరిగి సంపాదించుకునే భావోద్వేగ అస్త్రాలుగా మారుతుంటాయి. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ తాజాగా విడుదల చేసిన తన ఆత్మకథ బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్ అక్షరాలా ఇదే కోవకు చెందుతుంది. తన జీవితంలోని వ్యక్తిగత కష్టాలు, విషాదాలు, భావోద్వేగాలను ముందుపెట్టి దేశం మొత్తానికి తనను తాను ఒక నిస్సహాయ బాధితురాలిగా, త్యాగమూర్తిగా చిత్రీకరించుకునే ప్రయత్నం ఈ పుస్తకంలో అడుగడుగునా కనిపిస్తుంది. తన జీవిత ప్రయాణాన్ని భారతీయతకు ఆపాదించడం ద్వారా, సామాన్య ప్రజల కష్టాలతో తన రాజవంశపు అనుభవాలను ముడిపెట్టే ఒక కృత్రిమ ప్రయత్నం చేశారు. అయితే, క్షేత్రస్థాయి వాస్తవాల కోణంలో ఆలోచిస్తే--- పూట గడవక కష్టపడే శ్రమజీవులు, నిత్యం కన్నీళ్లతో పోరాడే కోట్లాది సామాన్య కుటుంబాల జీవితాలకు, ఢిల్లీ అధికార కోటల్లో సర్వసౌకర్యాల మధ్య సాగిన గాంధీ కుటుంబపు ప్రయాణానికి అసలు పొంతన ఎక్కడుంది? ప్రతి కుటుంబం ఎదుర్కొనే సాధారణ కష్టాలను, త్యాగాలను తన రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ,అలాంటి కష్టాలు తాను పడినట్లుగాచెప్పుకుని మరోసారి సింపతీ కార్డ్ ప్రయోగించడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్న ఇక్కడ బలంగా ఉదయిస్తోంది. దశాబ్దాల పాటు దేశాన్ని, పార్టీని తమ గుప్పిట్లో పెట్టుకుని శాసించిన నాయకత్వం, నేడు రాజకీయంగా ఉనికి కోల్పోతున్న తరుణంలో ప్రజల సానుభూతిని ఓట్లుగా మలుచుకునేందుకే ఈ భావోద్వేగ నాటకానికి తెరలేపిందని చెప్పక తప్పదు. అంతకుమించి, ఈ 544 పేజీల పుస్తకం ద్వారా సోనియా గాంధీ కేవలం తన వ్యక్తిగత జ్ఞాపకాలను పంచుకోవడమే కాకుండా,కాంగ్రెస్ పార్టీ చరిత్రలో మాయని మచ్చలుగా మిగిలిపోయిన నిరంకుశ విధానాలను, అప్రజాస్వామిక కుటుంబ పాలనను,ప్రజాబలం లేని హైకమాండ్ సంస్కృతి ని సమర్థించుకునే ఒక విఫలయత్నం చేశారు. నాటి ఎమర్జెన్సీ వంటి చీకటి అధ్యాయాలను సైతం తప్పిదం అంటూనే ఇందిరా గాంధీని ప్రజాస్వామ్యవాదిగా వెనకేసుకురావడం, దశాబ్ద కాలం పాటు రాజ్యాంగేతర శక్తిగా తాను నడిపిన పాలనను గొప్ప సమన్వయంగా చిత్రీకరించుకోవడం ఇందుకు నిదర్శనం. చరిత్ర చేసిన తప్పులకు ఆత్మపరిశీలన చేసుకోవాల్సింది పోయి, భావోద్వేగాల ముసుగులో ఆ నిరంకుశ పోకడలకు పవిత్రత ఆపాదించాలని చూడటం నేటి చైతన్యవంతమైన భారతీయ సమాజాన్ని మభ్యపెట్టే ప్రయత్నమే తప్ప మరొకటి కాదు!సోనియా గాంధీ తన ఆత్మకథలో మాజీ రాష్ట్రపతి, అత్యంత మేధావి, కాంగ్రెస్ పార్టీకి దశాబ్దాలుగా సేవ చేసిన అనుభవజ్ఞుడు ప్రణబ్ ముఖర్జీ ప్రధాని పదవిని ఆశించినట్లుగా అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. ఇది కేవలం చరిత్రను వక్రీకరించడమే కాకుండా, పార్టీలో ప్రతిభను అణచివేసే గాంధీ కుటుంబ నైజాన్ని మరోసారి బయటపెట్టింది. నిజానికి, ప్రణబ్ ముఖర్జీ లాంటి ఉద్దండుడైన నాయకుడిని ప్రధాని పదవికి ఎంపిక చేస్తే, ఆయన పార్టీలో ఏకు మేకు అవుతారని.. తన ఆధిపత్యానికి, హైకమాండ్ కనుసన్నల్లో జరిగే రాజకీయాలకు గండి కొడతారనే భయంతోనే సోనియా ఆ పదవిని దక్కకుండా చేశారనేది అందరికీ తెలిసిన వాస్తవం. పార్టీపై కుటుంబ పట్టు సడలిపోతుందనే ఏకైక కారణంగానే దేశానికి సేవ చేసే అత్యున్నత అవకాశాన్ని ప్రణబ్ దాకా రానివ్వకుండా అడ్డుకున్నారు. నేడు అదే విషయాన్ని తన పుస్తకంలో తిరగేసి, ప్రణబ్ ముఖర్జీనే పదవి కోసం ఆరాటపడ్డారని రుద్దేయడం సోనియా రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం. ఒక సీనియర్ నాయకుడిని రాజకీయ స్వార్థం కోసం ఎలా బలి చేశారనే దానికి ఈ ఆత్మకథే ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది.దేశాన్ని దివాళా స్థితి నుంచి గట్టెక్కించి ఆధునిక భారతానికి ఆర్థిక పునాదులు వేసిన మహానాయకుడి పేరును తమ చరిత్ర పుటల నుంచి తుడిచేయగలరేమో కానీ.. కోట్లాది భారతీయుల హృదయాల నుంచి మాత్రం చెరపలేరు!. భారతదేశం అత్యంత తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి, బంగారాన్ని తాకట్టు పెట్టాల్సిన దుస్థితిలో ఉన్న వేళ..సాహసోపేతమైన ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని ప్రగతి పథం వైపు నడిపించిన దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు. కేవలం దేశ ఆర్థిక వ్యవస్థనే కాకుండా, రాజీవ్ గాంధీ మరణానంతరం సంక్షోభంలో పడ్డ కాంగ్రెస్ పార్టీని సైతం సుదీర్ఘకాలం అధికారంలో నిలబెట్టడంలో పీవీ పాత్ర అనన్యసామాన్యం. కానీ, సోనియా గాంధీ ఆత్మకథలో పీవీ నరసింహారావు ప్రస్తావన కనీవినీ రీతిలో విస్మరించబడటం యాదృచ్ఛికం కాదు. గాంధీ కుటుంబ కనుసన్నల్లో కాకుండా, తన సొంత మేధస్సుతో, స్వయంకృషితో దేశాన్ని నడిపిన పీవీ అంటే సోనియా గాంధీకి మొదటి నుంచీ తీవ్రమైన విభేదాలు ఉండేవి. తమ కుటుంబం వెలుపల ఏ నేత కూడా పార్టీకి, దేశానికి గొప్ప నాయకత్వం వహించకూడదనే సంకుచిత మనస్తత్వమే నాటి విభేదాలకు అసలు కారణం. ఆ కక్ష , అసూయ ఎంత తీవ్రంగా ఉండేదంటే పీవీ జీవించి ఉన్నప్పుడే కాకుండా, ఆయన మరణించిన తర్వాత కూడా కాంగ్రెస్ హైకమాండ్ అత్యంత అవమానకరంగా వ్యవహరించింది. 2004లో పీవీ కన్నుమూసినప్పుడు, దేశానికి ఐదేళ్ల పాటు ప్రధానిగా సేవలందించిన ఒక మహానాయకుడి పార్థివ దేహాన్ని కనీసం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయం లోపలికి కూడా రానివ్వకుండా గేటు బయటే ఉంచి అవమానించిన చీకటి చరిత్ర సోనియా నాయకత్వానిది. ఢిల్లీలో ఆయన అంత్యక్రియలకు కనీసం స్థలం కేటాయించేందుకు కూడా మనసు రాని కఠిన వైఖరిని నాడు ప్రపంచం మొత్తం చూసింది. గాంధీ-నెహ్రూ కుటుంబానికి చెందని ఒక దక్షిణాది మేధావి దేశానికి ఆర్థిక విముక్తి కల్పించాడనే అక్కసుతో, ఆయన పేరును, కీర్తిని తొక్కేయడానికి నాడు అధికార పీఠంపై ఉండి అన్ని రకాల అవమానాలకు గురిచేశారు. ఇప్పుడు రెండు దశాబ్దాల తర్వాత కూడా ఆ ద్వేషం ఏమాత్రం తగ్గలేదని సోనియా తన ఆత్మకథ ద్వారా మరోసారి నిరూపించుకున్నారు. సొంత పార్టీ సీనియర్లు, పీవీ కుటుంబ సభ్యులు సైతం తప్పుబట్టే విధంగా, దేశ చరిత్రను మలుపుతిప్పిన పీవీ ప్రస్థానాన్ని తన పుస్తకంలో ఉద్దేశపూర్వకంగానే చెరిపివేయడం చరిత్రకు చేసిన ఘోర ద్రోహం. అప్పుడు పార్థివ దేహాన్ని పార్టీ ఆఫీసులోకి రానివ్వకుండా అవమానిస్తే, ఇప్పుడు అక్షరాల రూపంలోనూ ఆయన ఉనికి లేకుండా చేసి రెండోసారి అవమానించారు. తమ కుటుంబానికి భజన చేసేవారిని మాత్రమే ఆకాశానికెత్తుతూ, దేశం కోసం పనిచేసిన పీవీ లాంటి అసలైన దేశభక్తులను విస్మరించడం ద్వారా--- కాంగ్రెస్ అంటే కేవలం ఒకే కుటుంబం, మిగతావారంతా అక్కడ కేవలం పనివారు మాత్రమేననే కఠిన సత్యాన్ని సోనియా గాంధీ తన కలంతోనే లోకానికి చాటిచెప్పారు ఒకప్పుడు భావోద్వేగ ప్రసంగాలతో, కన్నీటి గాథలతో ప్రజలను ఆకర్షించిన రోజులు ఎప్పుడో గతించిపోయాయి. నేటి సమాజం ఈ మొసలి కన్నీళ్లను నమ్మే స్థితిలో ఏమాత్రం లేదు. దేశ ప్రజానీకం ఎప్పుడూ మోసపోరని, ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచిన చీకటి రోజులను, ఎమర్జెన్సీ నాటి అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదు.అంతిమంగా ఒక్క విషయం స్పష్టం గాంధీ కుటుంబానికి ఈ దేశం ఏమాత్రం రుణపడి లేదు. ఈ దేశ సంపద కానీ,రాజ్యాధికారం కానీ ఏ ఒక్క కుటుంబానికో దఖలు పడిన వారసత్వ హక్కు అంతకన్నా కాదు. సార్వభౌమాధికారం కలిగిన ప్రజాస్వామ్యంలో ఎల్లప్పుడూ ప్రజలే సర్వోన్నతులు. పడిపోయిన తమ కుటుంబ కీర్తిని తిరిగి పునరుద్ధరించుకోవడానికి,వాస్తవాలను మరుగున పరిచి రాసుకున్న ఈ కట్టుకథల పుస్తకం బిలాంగింగ్ రేపటి చరిత్ర ముందు ఒక దోషిగా నిలబడక తప్పదు!

నేడు హన్మకొండ లో జన చైతన్య సభ

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత..
కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలన్నదే ప్రజల ఆకాంక్ష
కేటీఆర్ సభకు అంచనాలకు మించి ప్రజలు తరలిరానున్నారు





వరంగల్ ప్రతినిధి , నవంబరు 21, అక్షర సవాల్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలన్నదే ప్రజల ఆకాంక్షగా మారిందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. నవంబరు 22న ఆదివారం రోజున కేడీసీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న కేటీఆర్ జన చైతన్య సభ నేపథ్యంలో శనివారం సభా స్థలిని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీ, మాజీ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ సభకు సుమారు 20 వేల మంది వస్తారని తొలుత అంచనా వేసినప్పటికీ, ప్రజల నుంచి వస్తున్న స్పందన చూస్తుంటే అంతకుమించిన స్థాయిలో జనసమీకరణ జరిగే అవకాశం ఉందన్నారు. కేటీఆర్ ప్రసంగాన్ని వినేందుకు వేలాదిగా ప్రజలు తరలిరానున్నారని, సభా ప్రాంగణం కూడా సరిపోని పరిస్థితి ఏర్పడవచ్చని అభిప్రాయపడ్డారు.ఇతర పార్టీలకు చెందిన నాయకులతో పాటు వివిధ రంగాలకు చెందిన మేధావులు, పలువురు ప్రముఖులు బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇది బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

420 హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు

గత మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన 420 హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని వినయ్ భాస్కర్ విమర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కేసీఆర్ పదేళ్ల పాలనలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశారని గుర్తుచేశారు.ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని, గులాబీ సైనికులుగా ప్రజల పక్షాన నిలుస్తామని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చూడాలన్నదే ప్రజల ఆకాంక్షగా ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని తెలిపారు.

ప్రజలను చైతన్యపరిచేందుకే జన చైతన్య సభ - ఆరూరి రమేష్

మాజీ శాసనసభ్యులు ఆరూరి రమేష్ మాట్లాడుతూ ప్రజలను చైతన్యపరిచేందుకే జన చైతన్య సభ నిర్వహిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే అభయహస్తం హామీలను అమలు చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. అయితే మూడేళ్ల పాలన పూర్తవుతున్నా హామీల అమలులో ఆశించిన పురోగతి లేదని విమర్శించారు.ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం రాజకీయ విమర్శలు, వ్యక్తిగత దూషణలకు ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న అనంతరం ఉద్యమ నాయకుడు కేసీఆర్ పదేళ్లపాటు అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయని, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను రద్దు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి తిరిగి పూర్వవైభవం రావాలంటే కేసీఆర్ నాయకత్వం అవసరమని, ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకురావడమే జన చైతన్య సభ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సభలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, మేధావులు, విద్యావేత్తలు బీఆర్ఎస్‌లో చేరనున్నారని వెల్లడించారు. కార్మికులు, కర్షకులు, యువత, మేధావులు, విద్యావేత్తలు, పత్రికా మిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.కాంగ్రెస్‌లో నాయకులు, ఎమ్మెల్యేలే అసంతృప్తితో ఉన్నారు – ఎర్రబెల్లి దయాకర్ రావు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్‌లో నాయకులు, ఎమ్మెల్యేలే అసంతృప్తితో ఉన్నారని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తన పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలను కాపాడుకునే పరిస్థితి కూడా లేదని, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీలో అంతర్గత అసంతృప్తి నెలకొందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, మేధావులు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రస్తుత పాలనపై ప్రజలతో పాటు అధికార పార్టీ నాయకుల్లోనూ అసంతృప్తి వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. రైతులు సాగునీరు, విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తుతున్నాయని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. 420 హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలులో విఫలమైందని, కనీసం గత ప్రభుత్వం అమలు చేసిన రైతు, ప్రజా సంక్షేమ పథకాలనైనా కొనసాగించి ప్రజలకు మేలు చేయాలని హితవు పలికారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాస్తవ పరిస్థితులను గుర్తించి రైతులు, పట్టణ ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కేటీఆర్ సభకు పార్టీ కార్యకర్తలు, నాయకులు, పట్టణ ప్రజలు, వివిధ రంగాల మేధావులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన వరంగల్ - వినోద్ కుమార్

మాజీ పార్లమెంట్ సభ్యులు బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన వరంగల్ నగరంలో అదే స్ఫూర్తితో కేటీఆర్ సభ జరుగుతోందని అన్నారు. తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో వరంగల్ నగరానికి ప్రత్యేక స్థానం ఉందని, ఉద్యమానికి నగరం ఎప్పుడూ అండగా నిలిచిందని గుర్తుచేశారు. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమానికి నూతన ఉత్తేజాన్ని అందించిన ఇదే ప్రాంగణంలో ఆదివారం కేటీఆర్ బహిరంగ సభ నిర్వహించనున్న నేపథ్యంలో ఆనాటి ఉద్యమ జ్ఞాపకాలను పంచుకున్నారు. 2001 ఏప్రిల్ 27న గులాబీ జెండా ఆవిష్కరణ అనంతరం కరీంనగర్‌లో నిర్వహించిన సభతో తెలంగాణ ఉద్యమ ప్రస్థానం ప్రారంభమైందని తెలిపారు. అనంతరం వివిధ రాజకీయ పరిణామాల నేపథ్యంలో వరంగల్‌లో నిర్వహించిన సభలు కూడా ఉద్యమానికి ఎంతో ఊపునిచ్చాయని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఢిల్లీలో కేసీఆర్‌తో పాటు తాము పార్లమెంట్ సభ్యులుగా ప్రయత్నాలు చేస్తున్న సమయంలో ఎదురైన ఆటుపోట్లలో వరంగల్ నగరానికి వచ్చి స్థానిక నాయకులు, మేధావులు, పత్రికా ప్రతినిధులతో చర్చించేవారమని తెలిపారు. వారి అభిప్రాయాలు, మద్దతు కేసీఆర్‌కు నూతన ఉత్సాహాన్ని అందించేవని పేర్కొన్నారు. వరంగల్ నగర ప్రజలు, రాజకీయ నాయకులు, మేధావులు తెలంగాణ ఉద్యమానికి అందించిన సహకారం మరువలేనిదన్నారు. అదే చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంగణంలో ఇప్పుడు కేటీఆర్ సభ జరగడం విశేషమని పేర్కొన్నారు. ఈ సభకు వరంగల్ నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నారని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని మరోసారి చాటేలా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తి.. ప్రభుత్వ భవిష్యత్తుపై అనిశ్చితి

సామాన్య ప్రజలే కాదు, సొంత పార్టీ నాయకులూ ప్రభుత్వ తీరుపై అసంతృప్తితో ఉన్నారని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై సామాన్య ప్రజలతో పాటు సొంత పార్టీ నాయకులు, మంత్రులు, శాసనసభ్యులు సైతం అసంతృప్తితో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు పెరుగుతున్నాయని, ఆ పార్టీలో నెలకొన్న పరిణామాలు ప్రభుత్వ భవిష్యత్తుపై అనేక సందేహాలకు తావిస్తున్నాయని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో రెండు వర్గాలు ఏర్పడ్డాయని, ఒక వర్గం ప్రభుత్వ విధానాలపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తోందని ఆరోపించారు. మీడియాలో కనిపిస్తున్న అసమ్మతి స్వరాల కంటే పార్టీలో అంతర్గతంగా ఉన్న అసంతృప్తి మరింత ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు తాము ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదని, కాంగ్రెస్‌లోని అంతర్గత పరిణామాలే ఆ పార్టీకి సమస్యగా మారాయని అన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో ఎలాంటి పరిణామాలైనా చోటుచేసుకోవచ్చని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, గతంలో కేసీఆర్ నాయకత్వంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గుర్తుచేసుకుంటున్నారని తెలిపారు. తిరిగి కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు.రేపు నిర్వహించనున్న కేటీఆర్ జన చైతన్య సభ ఈ రాజకీయ ప్రయాణంలో ఒక ముందడుగు మాత్రమేనని, రానున్న రోజుల్లో మరిన్ని సభలు నిర్వహించి ప్రజా సమస్యలపై పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వరంగల్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం కోసం..

రాబోయే ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడం, అలాగే వరంగల్ గడ్డపై గులాబీ జెండా ఎగరడం కోసం వరంగల్లు లీడర్లు అంతా ఏకమై కేటీఆర్ వస్తున్న సందర్భంగా సభా ఏర్పాట్లను పరిశీలించారు. వరంగల్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలిరావాలని, సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి

జిల్లాస్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలలో విజేతలకు ప్రశంసాపత్రాలు అందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
రాష్ట్రస్థాయి పోటీలకు ప్రతిభావంతులైన విద్యార్థుల ఎంపిక

వరంగల్, నవంబర్ 21, అక్షర సవాల్ : విద్యార్థుల్లో ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య విలువలు, పౌర బాధ్యతలపై అవగాహన పెంపొందించేందుకు జిల్లాస్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. భారత ఎన్నికల సంఘం, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్ హాలులో జిల్లాస్థాయి వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించినైది.పాఠశాల, నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, పర్వతగిరి, జీహెచ్ఎస్ కృష్ణకాలనీ, జీహెచ్ఎస్ చార్బేలికి తదితర పాఠశాల నుండి వ్యాసరచన పోటీలలో25 మంది పిల్లలు
క్విజ్ పోటీల్లో 21 పిల్లలు పాల్గొనగా వారిలో మొదటి,ద్వితీయ బహుమతులు సాధించిన పిల్లల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లాస్థాయిలో మొదటి పది స్థానాల్లో నిలిచిన ప్రతిభావంతులైన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే ఎన్నికల వ్యవస్థ, రాజ్యాంగ విలువలు, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో యువత కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, పౌర చైతన్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. జిల్లాస్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి వరంగల్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు గణేష్, కిషోర్ కుమార్



నర్సంపేట ఆర్డీఓ ఉమారాణి, రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, జిల్లా నోడల్ అధికారి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), నర్సంపేట ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మల్లం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

నల్లబెల్లి నవంబర్ 21 అక్షర సవాల్ :వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నల్లబెల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఆకస్మిక తనిఖీ చేశారు పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు . విద్యార్థులతో కలిసి భోజనం చేశారు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యకు తొలి ప్రాధాన్యత నిస్తుందని నేటి బాలలే రేపటి మానవ వనరులని విద్యార్థులు చదువుకునే రోజుల నుండే చదువంటే కష్టమని అనుకోకుండా ఇష్టంతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని పిల్లల్లో స్ఫూర్తిని నింపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జడ్పీ సీఈవో వసంత డిఆర్డిఓ నాగ పద్మజ నర్సంపేట ఆర్డీవో ఉమారాణి నల్లబెల్లి తహసిల్దార్ ముప్పు కృష్ణ ఎంపీడీవో పింగళి రమణారెడ్డి





కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ఎ సునీత మొదలైన వారు పాల్గొన్నారు

హన్మకొండ మత్స్యశాఖలో కలకలం!

ఎస్టీ మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

డీఎఫ్ఓ పిల్లి శ్రీపతిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.. సస్పెండ్ చేయాలి!

విచారణ అధికారికి ఎస్సీ ఎస్టీ సంఘాల విన్నపం

నిష్పక్షపాత విచారణకు ఎస్సీ, ఎస్టీ సంఘాల డిమాండ్

హన్మకొండ, నవంబర్ 21, అక్షర సవాల్: హన్మకొండ జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో ఎస్టీ మహిళా ఉద్యోగినిపై జిల్లా మత్స్యశాఖ అధికారి (డీఎఫ్ఓ) పిల్లి శ్రీపతి లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారంటూ వచ్చిన ఆరోపణలు తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. మహిళా ఉద్యోగినిని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని గిరిజన, ఎస్సీ సంఘాల నాయకులు ఆరోపించడంతో మత్స్యశాఖలో కలకలం రేగింది. సదరు అధికారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, తక్షణమే సస్పెండ్ చేయాలని సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

అసభ్య మెసేజ్‌లు.. బదిలీతో వేధింపులు?

హన్మకొండలోని ములుగు రోడ్డులో ఉన్న మత్స్యశాఖ కార్యాలయంలో ఫీల్డ్‌మెన్ రెగ్యులర్ ఉద్యోగినిగా పనిచేస్తున్న గిరిజన మహిళ ని డీఎఫ్ఓ పిల్లి శ్రీపతి వేధిస్తున్నారన్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి.తన వ్యక్తిగత మొబైల్ నంబర్‌కు సందేశాలు పంపుతూ, వాట్సాప్‌లో అసభ్యకరమైన మెసేజ్‌లు చేస్తూ శారీరకంగా లొంగాలని ఒత్తిడి తెస్తున్నారని బాధితురాలి తరఫున సంఘాల నాయకులు ఆరోపించారు. తనకు అనుకూలంగా వ్యవహరించకపోవడంతో బదిలీ చేయడం, అధిక పని భారం మోపడం ద్వారా మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు.ఒకవైపు మహిళా ఉద్యోగినిపై వేధింపుల ఆరోపణలు, మరోవైపు అధికార దుర్వినియోగం ఆరోపణలు రావడం ఉద్యోగ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

మత్స్యకారుల సొసైటీల నుంచి వసూళ్లకు ఒత్తిడి?

డీఎఫ్ఓ అవినీతికి పాల్పడుతున్నారని, మత్స్యకారుల సొసైటీల నుంచి లంచాలు వసూలు చేయాలని ఆదేశిస్తున్నారని కూడా సంఘాల నాయకులు ఆరోపించారు.





తనపై వచ్చిన ఆరోపణలను తప్పించుకునేందుకు మత్స్యకారుల సొసైటీలతో మహిళా ఉద్యోగినిపై తప్పుడు ఫిర్యాదులు చేయిస్తున్నారని, ఆమె ఇచ్చిన ఫిర్యాదులను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

ఫిర్యాదులు చేసినా చర్యలు లేవా?

ఈ వ్యవహారంపై గతంలోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి లకావత్ కర్ణాకర్ నాయక్ ఆరోపించారు. విచారణ పేరుతో కాలయాపన చేస్తూ బాధిత మహిళకు న్యాయం చేయకుండా పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా మత్స్యశాఖ అధికారి గిరిజన మహిళా ఉద్యోగినిపై వేధింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. అధికారిని విధుల నుంచి తొలగించి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

విచారణ అధికారికి వినతి.. పారదర్శక విచారణకు డిమాండ్

డీఎఫ్ఓ పిల్లి శ్రీపతిపై వచ్చిన లైంగిక వేధింపులు, అవినీతి ఆరోపణలపై విచారణకు వచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్ అవినాష్‌ను ఎంఆర్‌పీఎస్, ఎల్‌హెచ్‌పీఎస్ సంఘాల నాయకులు కలిసి మెమోరాండం సమర్పించారు. విచారణను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించి బాధిత మహిళకు న్యాయం చేయాలని కోరారు. మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ, మహిళా ఉద్యోగినిని లైంగికంగా లొంగదీసుకునేందుకు బదిలీ చేయడం, అధిక పని భారం మోపడం, అసభ్యకరమైన వాట్సాప్ సందేశాలతో వేధించడం వంటి ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుని తక్షణమే సస్పెండ్ చేయాలని కోరారు. విచారణ నిష్పక్షపాతంగా జరగకపోతే ఎస్సీ, ఎస్టీ కమిషన్‌తో పాటు మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమ్మయ్య రాథోడ్, సేవాలాల్ సేన రాష్ట్ర బాధ్యులు సుధాకర్ నాయక్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకులు దేవరాజ్, సేవాలాల్ సేన జిల్లా నాయకులు రాజ్ కుమార్ నాయక్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బానోతు భాస్కర్ నాయక్, వినోద్ నాయక్, భానోతు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సొకర్యాలతో నెక్కొండ బస్టాండ్ అభివృద్ధి

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

ఆర్టీసీ అధికారులకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశం





నెక్కొండ, నవంబర్ 21 అక్షర సవాల్: నెక్కొండ బస్టాండ్‌ను ఆధునిక సౌకర్యాలతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. శనివారం నెక్కొండ బస్టాండ్‌ను సందర్శించిన ఆయన, ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించి చేపట్టాల్సిన పనులపై చర్చించారు.ఈ సందర్భంగా టీజీ ఆర్టీసీ ఈడీ రాజశేఖర్,కరీంనగర్ జోన్ ఈడీ సోలమన్‌లతో కలిసి బస్టాండ్‌లోని పరిస్థితులను పరిశీలించారు. ఇప్పటికే సీసీ ప్లాట్‌ఫామ్ పనులు చేపట్టిన నేపథ్యంలో మిగిలిన సీసీ పనులు,గ్రౌండ్ లెవలింగ్,నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం తదితర పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు. ఆర్టీసీ ఇంజినీరింగ్ విభాగం చీఫ్ ఇంజినీర్ కవితకు మిగిలిన అభివృద్ధి పనులకు సంబంధించి వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని,కూర్చునేందుకు సరిపడా కుర్చీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. బస్టాండ్ ఆవరణను సక్రమంగా తీర్చిదిద్ది,పెండింగ్ పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.నెక్కొండ బస్టాండ్‌ను ప్రయాణికులకు అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉండేలా ఆధునీకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ సర్పంచ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయికృష్ణ,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బక్కి అశోక్,కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు,డీసీసీ సభ్యుడు నేతుల సారంగపాణి యాదవ్,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కొనిజేటి భిక్షపతి,రామాలయం కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి,సొసైటీ డైరెక్టర్ కొల్లి సుబ్బారెడ్డి,మార్కెట్ డైరెక్టర్లు బొమ్మెర బోయిన రమేష్ యాదవ్,తాళ్లూరి నరసింహస్వామి,దొడ్డ విజయ్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పులిశెట్టి భాను ప్రకాష్,యూత్ కాంగ్రెస్ మండల,పట్టణ అధ్యక్షులు సింగం ప్రశాంత్,ముద్రబోయిన శ్రీకాంత్,వార్డు సభ్యుడు దేవనబోయిన విజేందర్,కోర్టు ఏజీపీ బండి శివ,మాజీ సొసైటీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి,కాంగ్రెస్ నాయకులు చల్లారగోతం రెడ్డి,తాళ్లపల్లి భాస్కర్,మహమ్మద్ అన్వర్,కొత్తకొండ గణేష్,రావుల తిరుపతిరెడ్డి,బూరుగు నరేష్,నంగునూరు భాస్కర్,బొమ్మెర శ్రీనివాస్ తదితరులు,వివిధ గ్రామాల సర్పంచులు,ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



జీడబ్ల్యూఎంసీ ఏ ఎంహెచ్ఓగా కమల్ చందు నాయక్ బాధ్యతల స్వీకరణ

శాలువాతో సత్కరించిన మల్లం రాజేష్, ఐఎన్‌టీయూసీ నాయకులు



వరంగల్, నవంబరు 21, అక్షర సవాల్ : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఏ ఎంహెచ్ఓగా శనివారం జి. కమల్ చందు నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంహెచ్ఓ మల్లం రాజేష్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. జీడబ్ల్యూఎంసీ ఐఎన్‌టీయూసీ 452 యూనియన్ అధ్యక్షులు వాగుమారి సత్యనారాయణ ఆధ్వర్యంలో కమల్ చందు నాయక్‌ను శాలువా, పూల బొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ ఐఎన్‌టీయూసీ 452 యూనియన్ జాయింట్ సెక్రటరీలు మట్టెవాడ సారంగం, శనిగారపు ఉపేందర్, బి. రఘు, రమేష్, హోంగార్డు దగ్గులా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

32 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ



నల్లబెల్లి, నవంబర్ 21 (అక్షర సవాల్): నల్లబెల్లి మండలం గోవిందపురం గ్రామంలో 32 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మలోత్ చరణ్ సింగ్ మంజూరు పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.కె. మైనుద్దీన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా చరణ్ సింగ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చార్ల శివారెడ్డి, గంధం కుమార్, అగబోయిన రణధీర్, ముత్యాల రాజు, పేరాల రవీందర్ రావు, పేరాల సురేందర్ రావు తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

దళిత మేధా శక్తి నల్లబెల్లి మండల ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ కుమారస్వామి

అధికార ప్రతినిధిగా జన్ను రవి ఏకగ్రీవ ఎన్నిక



నల్లబెల్లి, నవంబర్ 21 (అక్షర సవాల్)దళిత మేధా శక్తి నల్లబెల్లి మండల ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ కుమారస్వామి, మండల అధికార ప్రతినిధిగా జన్ను రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బోట్ల పవన్ సూచనల మేరకు వ్యవస్థాపక సభ్యులు పెంబర్తి శ్రీనివాస్, అడ్డ రాజు నూతన నియామకాలను ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులు ఐక్యంగా ఉంటూ విద్య, చైతన్యం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. దళితుల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బోట్ల దయాకర్, శనిగరం సంపత్, గంగారపు వినయ్, కనకం నవీన్, నత్తి చిరంజీవి, మాట్ల మహేష్, జన్ను కర్ణాకర్, కుక్కమూడి గోవర్ధన్, పసునూరి నవీన్, కుక్కమూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీ తండా (న్యూ)ను సందర్శించాలి - సంతోష్ నాయక్ విజ్ఞప్తి



భూపాలపల్లి, నవంబరు 21, అక్షర సవాల్ : లంబాడీ తండా (న్యూ)ను సందర్శించి గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని సేవాలాల్ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ సంతోష్ నాయక్, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను కోరారు.రంగసముద్రం వరకు గ్రావెల్ రోడ్డు, సీసీ రోడ్డు, రెండు బోర్‌వెల్లు, గ్రంథాలయ భవనం, సేవాలాల్ ఆలయ నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో తండాను సందర్శిస్తానని హుస్సేన్ నాయక్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

శ్రీవారికి బంగారు కానుకల మహావిరాళం!

121 కిలోల బంగారు ఆభరణాలు సమర్పించనున్న భక్తుడు

రూ.150--160 కోట్ల విలువైన కానుక

తిరుమల ఆలయ చరిత్రలోనే అతిపెద్ద విరాళమని టీటీడీ వెల్లడి



తిరుమల, నవంబర్ 21, అక్షర సవాల్: కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారికి ఓ భక్తుడు అపూర్వమైన బంగారు కానుకను సమర్పించేందుకు సిద్ధమయ్యారు. ఏకంగా 121 కిలోల బంగారు ఆభరణాలను శ్రీవారికి విరాళంగా అందించనున్నట్లు టీటీడీ వెల్లడించింది. వీటి విలువ సుమారు రూ.150 నుంచి రూ.160 కోట్ల వరకు ఉంటుందని సమాచారం. ఈ నెల 26న స్వామివారికి ఈ భారీ బంగారు కానుకను సమర్పించనున్నట్లు టీటీడీ తెలిపినట్లు వార్తా సమాచారం పేర్కొంది. సుమారు తొమ్మిది నెలలుగా తయారు చేయించిన 45 బంగారు ఆభరణాలను భక్తుడు శ్రీవారి సేవకు అంకితం చేయనున్నట్లు వెల్లడించింది.

ఆలయ చరిత్రలో అరుదైన ఘట్టం

శ్రీవారిపై అపారమైన భక్తి, విశ్వాసంతో ఇంత భారీ మొత్తంలో బంగారు ఆభరణాలను సమర్పించేందుకు ముందుకు రావడం భక్తి పరాకాష్టకు నిదర్శనంగా నిలుస్తోంది. తిరుమల ఆలయ చరిత్రలోనే ఇదే అతిపెద్ద విరాళమని టీటీడీ పేర్కొన్నట్లు సమాచారం. శ్రీవారి నిత్యకైంకర్యాలు, అలంకరణల్లో ఈ ఆభరణాలు వినియోగించే అవకాశం ఉంది. అయితే ఆభరణాల వివరాలు, సమర్పించే భక్తుడి వివరాలు, అధికారిక కార్యక్రమానికి సంబంధించిన పూర్తి సమాచారం టీటీడీ నుంచి వెల్లడికావాల్సి ఉంది. భక్తుల అపారమైన విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తున్న ఈ మహా కానుక తిరుమలలో మరో చారిత్రక ఘట్టంగా నిలవనుంది.

డిసెంబర్ 6న హనుమకొండలో వాకర్స్ ఇంటర్నేషనల్ 40వ వార్షికోత్సవ వేడుకలు





హనుమకొండ, నవంబర్ 21, అక్షర సవాల్:వాకర్స్ ఇంటర్నేషనల్ 40వ వార్షికోత్సవ వేడుకలను డిసెంబర్ 6, 2026న హనుమకొండలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకల్లో ఉత్తర తెలంగాణ జిల్లాల వాకర్స్ క్లబ్‌ల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.ఇందులో భాగంగా వాకర్స్ ఇంటర్నేషనల్ 303 పరిధిలోని వివిధ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులకు ఆహ్వాన పత్రికలు అందజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్, చీఫ్ అడ్వైజర్ చాడ దశరథరామి రెడ్డి, పీఏవీపీ జంగ గోపాల్ రెడ్డి, ఆర్‌సీ పశ్చిమట్ల ఎల్లాగౌడ్, పీఆర్ఓ నర్సింహారావుతో పాటు పలువురు వాకర్స్ ప్రముఖులు పాల్గొన్నారు.వడ్డేపల్లి ట్యాంక్‌బండ్, కిట్స్, రంగలీల, ఏవీవీ, సీకేఎం, ఓ సిటీ, గోపాలస్వామి గుడి, ఆర్ఆర్ఆర్, వాగ్ధాట వాకర్స్ అసోసియేషన్ల ప్రతినిధులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.నాలుగు దశాబ్దాలుగా వాకర్స్ ఇంటర్నేషనల్ కొనసాగిస్తున్న సేవా ప్రస్థానానికి ప్రతీకగా ఈ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఉత్తర తెలంగాణలోని అన్ని వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

ఈ నెల 26 న మహిళలు - రాజ్యాంగం సదస్సు

పోస్టర్ ను అవిష్కరించిన కవిత



హైదరాబాద్:భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఈనెల 26న బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళలు - రాజ్యాంగం సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా శనివారం నాడు బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల కవిత మహిళా నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులు.. ఆ ఫలాలు ఎంతమేరకు అందుతున్నాయి.. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన తరుణంలో వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలు.. శ్రామికులు, గృహిణుల జీవన స్థితిగతులు సహా మహిళలకు సంబంధించిన అన్ని అంశాలపై సదస్సులో చర్చించనున్నారు.

ఒక్క కొత్త పెన్షన్ ఇచ్చినట్లు నిరూపిస్తే రాజీనామా

రేవంత్ రెడ్డికి పాడి కౌశిక్ రెడ్డి సవాల్



హైదరాబాద్:నా హుజూరాబాద్ నియోజకవర్గంలో ఒక్క కొత్త పెన్షన్ ఇచ్చినట్లు నిరూపిస్తే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. లేకుంటే నీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తావా రేవంత్ రెడ్డి అని నిలదీసారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 3 ఏండ్లలో హుజూరాబాద్ నియోజకవర్గంలో 5250 పెన్షన్లు డిలీట్ చేసి.. కొత్తగా 4221 పెన్షన్లు ఇచ్చారు. అంటే కొత్తవి ఇవ్వకపోగా.. ఉల్టా 1029 పెన్షన్లు తీసేశారని అన్నారు.సిద్దిపేటలో రేవంత్ పోటీ చేస్తే డిపాజిట్లు కూడా రావు. హరీష్ రావుకు, రేవంత్ రెడ్డికి అసలు పోలికే లేదని విమర్శిస్తూ.. రేవంత్‌ను చీటర్‌గా అభివర్ణించారు

తెలంగాణ టూరిజం కొత్త వన్‌డే టూర్.. పోచంపల్లికి ప్రత్యేక ప్యాకేజీ

తెలంగాణ టూరిజం శాఖ నుంచి 'ఒక రోజు పోచంపల్లిలో' టూర్
యాదాద్రి ఆలయ దర్శనంతో పాటు పోచంపల్లి సందర్శన
ఇక్కత్ చేనేత కళను ప్రత్యక్షంగా చూసే అవకాశం
పెద్దలకు రూ. 2,100, పిల్లలకు రూ. 1,680గా ధర నిర్ణయం

రేపటి నుంచి ప్యాకేజీ ప్రారంభం



రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) ఒక కొత్త ప్యాకేజీని ప్రకటించింది. 'ఒక రోజు పోచంపల్లిలో' పేరుతో ఈ వన్‌డే టూర్‌ను అందుబాటులోకి తెచ్చింది. చేనేతకు ప్రసిద్ధిగాంచిన పోచంపల్లి వైభవాన్ని, ఇక్కత్ కళ నైపుణ్యాన్ని పర్యాటకులకు పరిచయం చేసేందుకు రూపొందించిన ఈ పర్యటన ఈ నెల 22వ తేదీ (ఆదివారం) నుంచి ప్రారంభం కానుంది. ఈ టూర్‌లో భాగంగా పర్యాటకులను మొదట ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ దర్శనానికి తీసుకెళ్తారు. అనంతరం, పోచంపల్లికి చేరుకుంటారు. అక్కడ తెలంగాణ టూరిజం శాఖకు చెందిన హరిత హోటల్‌లో భోజనం ఏర్పాటు చేస్తారు. స్థానిక స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన సంప్రదాయ వంటకాలను ఇక్కడ రుచి చూడవచ్చు. పోచంపల్లి ఇక్కత్ చేనేత వారసత్వాన్ని, దాని గొప్పతనాన్ని పర్యాటకులకు పరిచయం చేయడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. ఇక్కడి ఇక్కత్ మ్యూజియంలో పోచంపల్లి కళ చరిత్రను, తయారీ విధానాలను తెలుసుకోవచ్చు. అలాగే, స్థానిక నేత కార్మికులతో మాట్లాడే అవకాశం కూడా కల్పిస్తారు. దారాలకు రంగులు అద్దడం, ముడివేయడం, నేత నేయడం వంటి ప్రక్రియలను వర్క్‌షాప్ ద్వారా పర్యాటకులు ప్రత్యక్షంగా చూసే వీలుంటుంది. పర్యటన చివరలో అసలైన చేనేత వస్త్రాలను కొనుగోలు చేసేందుకు షాపింగ్ సౌకర్యం కూడా ఉంది ఈ ప్యాకేజీలో ఏసీ బస్సులో ప్రయాణం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఆలయ దర్శనం, ఎంట్రీ టిక్కెట్లు, నేత వర్క్‌షాప్‌లో పాల్గొనే అవకాశం ఉంటాయి. ఈ టూర్‌కు పెద్దలకు రూ. 2,100, పిల్లలకు రూ. 1,680గా ధరను నిర్ణయించారు. ఈ టూర్‌ను తెలంగాణ పర్యాటక శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలు, బుకింగ్స్ కోసం బషీర్‌బాగ్‌లోని సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం (9848540371), సికింద్రాబాద్ యాత్రి నివాస్ (9848126947), లేదా పర్యాటక భవన్ (9848306435) సంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

భవిష్యత్‌లో ప్రమాదం రాబోతోంది..

తుపాకులు కొనుక్కోండి: రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు
దేశంలో హిందువుల మనుగడపై రాజాసింగ్ ఆందోళన
లైసెన్స్‌డ్ ఆయుధాలు సమకూర్చుకోవాలని హిందువులకు పిలుపు
గ్లోబల్ ముస్లిం జనాభా పెరుగుదలపై ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు
భవిష్యత్ భద్రతా ముప్పులను ధీటుగా ఎదుర్కోవాలని సూచన
చట్టబద్ధమైన అనుమతుల మేరకే తుపాకులు కొనాలని వెల్లడి



భవిష్యత్తులో దేశంలో హిందువుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే భద్రతా ముప్పులను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ పద్ధతులను నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. చట్టప్రకారం అనుమతులు పొంది ప్రతి హిందువు తప్పనిసరిగా లైసెన్స్‌డ్ తుపాకీని దగ్గర ఉంచుకోవాలని అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడిన వీడియో దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చక్కర్లు కొడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ముస్లింల జనాభా నానాటికీ పెరిగిపోతోందని రాజాసింగ్ తన వీడియోలో ప్రస్తావించారు. దీనివల్ల కాలక్రమేణా భారతదేశంలో హిందువుల ఉనికికి, భద్రతకు పెను సవాలు ఎదురవుతుందని వ్యాఖ్యానించారు. అలాంటి అనిశ్చిత పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు సమాజం ఎలా తట్టుకుంటుందని ప్రశ్నించారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు ఇప్పటి నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ధీటుగా ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఆత్మరక్షణ కోసమే తుపాకులు కొనుగోలు చేయాలని చెప్పిన ఆయన, దానికి సంబంధించి చట్టబద్ధమైన నిబంధనలను పాటించాలని గుర్తుచేశారు. ఈ వీడియో నెట్టింట బయటకు రావడంతో తీవ్ర దుమారం చెలరేగింది. ఒక ప్రజాప్రతినిధి బహిరంగంగా ఇలాంటి పిలుపునివ్వడంపై రాజకీయ పక్షాలు, సామాజిక వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఆర్బీఐ నివేదికను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు

కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి ఆగిపోయిందన్న కేటీఆర్
తెలంగాణలో గ్రామ పంచాయతీల ఖర్చులు భారీగా తగ్గాయని విమర్శ
ఆర్బీఐ నివేదిక ప్రకారం పంచాయతీ సగటు వ్యయం రూ.6.24 లక్షలకు పడిపోయిందని వెల్లడి



హైదరాబాద్:కేసీఆర్ హయాంలో అభివృద్ధి బాటలో సాగిన తెలంగాణ గ్రామాలు, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో నిధుల కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల ఖర్చులు భారీగా తగ్గిపోయాయని పేర్కొంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) విడుదల చేసిన 'ఫైనాన్సెస్ ఆఫ్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్' నివేదికను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఈ వివరాలను వెల్లడించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు సగటున ఒక్కొక్కటి రూ. 16.59 లక్షలు ఖర్చు చేయగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో 2024-25 నాటికి ఆ మొత్తం రూ. 6.24 లక్షలకు పడిపోయిందని ఆయన తెలిపారు. ప్రజలు కట్టిన పన్నులు, ప్రభుత్వం తెస్తున్న అప్పులు అభివృద్ధి పనులకు చేరడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో పల్లె నుంచి పట్నం వరకు ఎక్కడా అభివృద్ధి కనిపించడం లేదని, జరుగుతున్నదంతా విధ్వంసమేనని కేటీఆర్ పేర్కొన్నారు.

పౌల్ట్రీ దిగ్గజం స్నేహ ఫామ్స్‌కు ఐటీ షాక్...



హైదరాబాద్, నవంబరు 21:ప్రముఖ పౌల్ట్రీ, అగ్రి బిజినెస్ సంస్థ స్నేహ గ్రూప్ పై ఆదాయపు పన్ను శాఖ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో ఆకస్మికంగా సోదాలు చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ సహా పలు చోట్ల ఉన్న సంస్థ కార్యాలయాలతో పాటు హైదరాబాద్ కొండాపూర్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్నేహ గ్రూప్ డైరెక్టర్లు రామ్ రెడ్డి దెండి, వరుణ్ రెడ్డి దెండి, స్నేహ దెండి నివాసాల్లో ఐటీ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.1982లో 'రామ్ రెడ్డి చికెన్ మార్కెట్'గా ప్రారంభమైన ఈ సంస్థ, 1994లో స్నేహ ఫామ్స్ గా విస్తరించి అంచెలంచెలుగా ఎదిగింది. ప్రస్తుతం ఈ గ్రూప్ పౌల్ట్రీ బ్రీడింగ్, చికెన్ ప్రాసెసింగ్, పశువుల దాణా, సఫల బ్రాండ్ పేరుతో వంట నూనెల తయారీ రంగాల్లో వ్యాపారాలు నిర్వహిస్తోంది. తెలంగాణలో గంటకు 12,000 కోళ్లను ప్రాసెస్ చేసే సామర్థ్యం గల అత్యాధునిక ఆటోమేటెడ్ ప్లాంట్‌ను ఈ సంస్థ నిర్వహిస్తోందని తెలిసిందే. 2,000 మందికి పైగా కాంట్రాక్ట్ రైతులతో కలిసి వ్యాపారం చేస్తున్న స్నేహ గ్రూప్, భారత రక్షణ సంస్థలకు (డిఫెన్స్) సైతం ఫ్రోజెన్ చికెన్ సరఫరా చేస్తోంది. అంతేకాకుండా, 2024 ఆర్థిక సంవత్సరంలో సింగ్ పౌల్ట్రీని కొనుగోలు చేసిన ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టేందుకు జపాన్‌కు చెందిన దిగ్గజ కంపెనీ మిట్సుయి & కో కూడా ఆసక్తి చూపింది. సంస్థ లావాదేవీలు, లెక్కల్లో అవకతవకలు ఉన్నాయన్న సమాచారంతో ఐటీ శాఖ రంగంలోకి దిగి ఆకస్మిక తనిఖీలు చేపట్టింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం...

నల్గొండ యువకుడి మృతి

నల్గొండ: నల్గొండ జిల్లా మునుగోడుకు చెందిన సాయితేజ(25) ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి, వారం క్రితమే ఉద్యోగం సంపాదించాడు. కారులో వెళు ్తండగా ఓ జింక అడ్డు రావడంతో దాన్ని ఢీకొట్టి కారు ఆగిపోయింది. అదే సమయంలో వెనక నుంచి వచ్చిన వాహనాలు అతడి కారును గుద్దాయి. తీవ్రంగా గాయపడిన సాయితేజను ఆసుపత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు చెప్పారు. దీంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

టెలిగ్రామ్ ద్వారా మ్యూల్ ఖాతాల దందా..

హైదరాబాద్‌లో యువకుడి అరెస్ట్



హైదరాబాద్, నవంబర్ 21: మ్యూల్ ఖాతాల ద్వారా సైబర్ మోసాలకు సంబంధించిన దబ్బును మళ్లిస్తున్న ఓ గ్యాంగ్ గుట్టురట్టు అయింది. టెలిగ్రామ్ వేదికగా మ్యూల్ ఖాతాలను సేకరించి సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న భూమేశ్ అనే యువకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేయగా.. ఈ దందా నడుపుతున్న కీలక సూత్రధారి అదరావేణి చందు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పోలీసుల కథనం ప్రకారం.. భూమేశ్ అనే యువకుడు.. టెలిగ్రామ్ వేదికగా వ్యక్తుల నుంచి డెబిట్ కార్డులను సేకరించి.. మ్యూల్ ఖాతాల ద్వారా డబ్బును విత్‌డ్రా చేసి సైబర్ నేరగాళ్లకు అందిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ విధంగా విత్‌డ్రా చేసిన డబ్బును భూమేశ్.. కరీంనగర్‌కు చెందిన అదరావేణి చందు అనే వ్యక్తికి అందిస్తున్నట్లు పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. చందు సూచనలతోనే డెబిట్ కార్డులను సేకరించి, నగదును విత్‌డ్రా చేస్తున్నట్లు వెల్లడించాడు. ఈ లావాదేవీలు పూర్తయ్యాక డెబిట్ కార్డులను ధ్వంసం చేస్తున్నట్లు తెలిపాడు. ఇప్పటివరకు 10 నుంచి 12 డెబిట్ కార్డులు సేకరించినట్లు నిందితుడు భూమేశ్ పోలీసుల విచారణలో వెల్లడించాడు. ఈ మేరకు డెబిట్ కార్డులను సేకరిస్తూ సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ఐదు డెబిట్ కార్డులు, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

తెలంగాణలో బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్ !



హైదరాబాద్, నవంబరు 21:తెలంగాణ మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణపై చర్చలు ఊపందుకున్న వేళ, రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాల్లో బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్ ఒక్కసారిగా కాకరేపుతోంది. రాష్ట్ర జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బలహీన వర్గాలకు అధికారంలో సముచిత వాటా కల్పించాలంటూ ఆ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ నేతలు, మంత్రులు ఏకంగా అగ్రనేత రాహుల్ గాంధీ వద్దే తమ గళాన్ని వినిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 15 మంది మంత్రులు ఉండగా, కేబినెట్‌లో ఇంకా రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ విస్తరణలోనే ప్రస్తుత ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు అదనంగా ఒక బీసీ నేతకు డిప్యూటీ సీఎం పీఠం కట్టబెట్టాలనే ప్రతిపాదన పార్టీలో తీవ్ర చర్చకు దారితీసింది.జనాభా ప్రాతిపదికన హక్కులు, అధికారం దక్కాలి .. అంటూ దేశవ్యాప్తంగా కులగణన, సామాజిక న్యాయం నినాదాన్ని భుజానికెత్తుకున్న రాహుల్ గాంధీకి ఇప్పుడు సొంత రాష్ట్రం తెలంగాణలోనే అసలైన పరీక్ష ఎదురైంది. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో బీసీ ఓటర్ల పాత్ర అత్యంత కీలకమైనప్పటికీ, కేబినెట్‌లో ఆ సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో ప్రాతినిధ్యం దక్కలేదనే అసంతృప్తి మొదటి నుంచీ ఉంది. ఇటీవలే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ భవిష్యత్తులో బీసీ ముఖ్యమంత్రి ఉంటారంటూ చేసిన వ్యాఖ్యలు పార్టీలో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ఇప్పుడు ఏకంగా బీసీ డిప్యూటీ సీఎం పదవి కోసం నేతలు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేస్తుండటంతో, రాహుల్ గాంధీ తన సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని ఇక్కడ ఎంతవరకు అమలు చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.అయితే, బీసీ నేతకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడానికి పార్టీలోని సీనియర్ నేతలు, అగ్రవర్ణ వర్గాలు అంత సులభంగా అంగీకరిస్తాయా అన్నదే అసలు ప్రశ్న. ఇప్పటికే కేబినెట్‌లోని రెండు ఖాళీల కోసం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి,ప్రేమ్‌సాగర్ రావు వంటి సీనియర్ నేతలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మరోవైపు, ఇప్పటికే ఒక డిప్యూటీ సీఎం పదవి ఎస్సీ సామాజిక వర్గం వద్ద ఉండగా, మరో డిప్యూటీ సీఎం పదవిని సృష్టిస్తే అధికార కేంద్రాలు పెరిగి పరిపాలనలో సమన్వయ లోపం తలెత్తుతుందని సీనియర్లలోని ఒక వర్గం వాదిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కేబినెట్ కూర్పులో సామాజిక సమతుల్యతతో పాటు, పార్టీలో తన పట్టు సడలకుండా జాగ్రత్త పడాల్సిన సున్నితమైన పరిస్థితి నెలకొంది.వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు మరో రెండేళ్ల సమయం మాత్రమే ఉన్నందున , డిసెంబర్‌లో జరగనున్నట్లు భావిస్తున్న కేబినెట్ విస్తరణ కాంగ్రెస్ భవిష్యత్తుకు అత్యంత కీలకం కానుంది. ఒకవేళ అధిష్టానం బీసీ డిప్యూటీ సీఎం డిమాండ్‌ను పక్కనపెడితే,రాష్ట్రంలోని మెజారిటీ ఓటు బ్యాంకు అయిన బలహీన వర్గాలు పార్టీకి దూరమయ్యే ప్రమాదం ఉంది. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్,బీజేపీలు ఇదే అంశాన్ని ఆయుధంగా చేసుకుని కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే అవకాశం ఉంది. అలాగని డిప్యూటీ సీఎం పదవి ఇస్తే,ఆ పదవి కోసం పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి లేదా ఇతర సీనియర్ బీసీ నేతల మధ్య పోటీ నెలకొని అంతర్గత కుమ్ములాటలు బయటపడే ఛాన్స్ ఉంది.మొత్తంగా చూస్తే, తెలంగాణ కాంగ్రెస్‌లో 'బీసీ డిప్యూటీ సీఎం' అంశం ఇప్పుడు అధిష్టానానికి కత్తిమీద సాములా మారింది.కేవలం నినాదాలు, హామీలతోనే సరిపెట్టకుండా 56 శాతం జనాభా ఉన్న బీసీలకు అత్యున్నత పదవి ఇచ్చి రాహుల్ గాంధీ చరిత్ర సృష్టిస్తారా, లేక సీనియర్ల ఒత్తిడికి తలొగ్గి పాత ఫార్ములాతోనే సర్దుబాటు చేస్తారా అన్నది వేచి చూడాలి.

ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీలో భారీగా నియామకాలు

- వ్యవసాయ వర్సిటీలో 566 అధ్యాపక పోస్టుల భర్తీకి ఆమోదం
- ఆర్థిక శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- రాతపరీక్షతో పాటు ఇంటర్వ్యూలు తప్పనిసరని స్పష్టీకరణ
- త్వరలో రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ జారీకి వర్సిటీ సన్నాహాలు



తెలంగాణలోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. వర్సిటీలో మొత్తం 566 బోధనా సిబ్బంది పోస్టులను భర్తీ చేసేందుకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వీటిలో 48 ప్రొఫెసర్, 148 అసోసియేట్ ప్రొఫెసర్, 370 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఉన్నాయి.రాష్ట్రంలో కొత్తగా వ్యవసాయ కళాశాలల ఏర్పాటు, నూతన కోర్సుల ప్రవేశం, అత్యాధునిక పరిశోధనా కేంద్రాల ప్రారంభం వంటి కారణాలతో వర్సిటీలో అధ్యాపకుల అవసరకత పెరిగింది. ఈ నేపథ్యంలో ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని కోరుతూ విశ్వవిద్యాలయం ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. వీటిని పరిశీలించిన ప్రభుత్వం, ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.నియామక ప్రక్రియ పారదర్శకంగా సాగాలన్న ఉద్దేశంతో, కేవలం రాత పరీక్ష ఆధారంగానే ఈ పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్వ్యూలను మినహాయించాలని వర్సిటీ పాలకమండలి ప్రభుత్వాన్ని కోరింది. అయితే, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) నిబంధనల ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహించడం తప్పనిసరని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇంటర్వ్యూలు లేకుండా నియామకాలు చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని ముఖ్యమంత్రి కార్యాలయం, ఆర్థిక శాఖ తేల్చిచెప్పాయి. ఆర్థిక శాఖ నుంచి అనుమతి లభించడంతో, విశ్వవిద్యాలయం త్వరలోనే అధికారిక నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

సికింద్రాబాద్ టూ కరీంనగర్‌కు నమో భారత్...

కరీంనగర్, నవంబరు 21:ఉపాధి, విద్య, వ్యాపార అవసరాల కోసం హైదరాబాద్‌లో స్థిరపడిన ఉత్తర తెలంగాణ ప్రజలకు సొంతూళ్లకు రాకపోకలు పెద్ద సమస్యగా మారాయి. ముఖ్యంగా నగర తూర్పు ప్రాంతాలైన ఘట్‌కేసర్, చర్లపల్లి, మౌలాలి, బోడుప్పల్, తార్నాక తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజలు స్వస్థలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల్లో ప్రయాణిస్తే అధిక ఛార్జీలు, ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతుండగా.. రైళ్లలో వెళ్లాలంటే గంటల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి పెద్దపల్లి, కాజీపేట మీదుగా కరీంనగర్‌కు నమో భారత్ ర్యాపిడ్ రైలు లేదా మెము రైలు ప్రవేశపెట్టాలనే డిమాండ్ పెరుగుతోంది. ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు సైతం ఈ ప్రతిపాదనను ముందుకు తెస్తున్నారు. ఈ మార్గంలో వేగవంతమైన రైలు సేవలు అందుబాటులోకి వస్తే హైదరాబాద్‌లో నివసించే ఉత్తర తెలంగాణ ప్రజలకు ప్రయాణ కష్టాలు గణనీయంగా తగ్గుతాయని అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం హైదరాబాద్–కరీంనగర్ మధ్య ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ప్రధాన రవాణా సాధనంగా ఉన్నాయి. ప్రతి ఐదు నిమిషాలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్, రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రయాణానికి సుమారు నాలుగు గంటలు పడుతోంది. కనీస టికెట్ ధర రూ.220 నుంచి ప్రారంభమవుతుండగా.. లగ్జరీ బస్సుల్లో ఛార్జీలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. పండగలు, వారాంతాల్లో ప్రయాణికుల రద్దీ పెరిగితే బస్సుల్లో సీట్లు దొరకడం కూడా కష్టంగా మారుతోంది. మరోవైపు రైలు ప్రయాణం చౌకగా ఉన్నప్పటికీ ప్రస్తుతం కరీంనగర్ నుంచి కాచిగూడకు



నడుస్తున్న డెమూ ప్యాసింజర్ రైలు ప్రయాణికులకు పెద్దగా ఉపయోగపడటం లేదు. ఈ రైలు జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్ మీదుగా సుమారు 309 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్తోంది. దీంతో గమ్యస్థానానికి చేరుకోవడానికి ఎనిమిది నుంచి తొమ్మిది గంటలు పడుతోంది. నిజామాబాద్–మేడ్చల్ మార్గంలో సింగిల్ రైల్వే లైన్ ఉండటం, గరిష్ఠ వేగపరిమితి గంటకు 110 కిలోమీటర్లుగా ఉండటం వల్ల ప్రయాణ సమయం మరింత పెరుగుతోంది. బస్సులో నాలుగు గంటల్లో చేరుకునే దూరానికి రైలులో దాదాపు రెట్టింపు సమయం వెచ్చించాల్సి వస్తోంది.కరీంనగర్ నుంచి పెద్దపల్లి, కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు రైలు నడిపేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పెద్దపల్లి–కాజీపేట మధ్య మూడో రైల్వే లైన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. కాజీపేట నుంచి ఘట్‌కేసర్ వరకు రెండో లైన్, ఘట్‌కేసర్ నుంచి సికింద్రాబాద్ వరకు నాలుగో రైల్వే మార్గం అందుబాటులో ఉన్నాయి. పెద్దపల్లి నుంచి సికింద్రాబాద్ వరకు రైళ్లు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉంది. కరీంనగర్–పెద్దపల్లి మధ్య ఉన్న 35 కిలోమీటర్ల సింగిల్ లైన్‌లోనూ గంటకు 110 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడిపే అవకాశం ఉందని ప్రతిపాదకులు పేర్కొంటున్నారు. ఈ మార్గంలో నమో భారత్ ర్యాపిడ్ రైలు లేదా మెము రైలును ప్రవేశపెడితే సికింద్రాబాద్–కరీంనగర్ మధ్య ప్రయాణ సమయాన్ని మూడు నుంచి మూడున్నర గంటల నుంచి నాలుగు గంటలలోపు పరిమితం చేయవచ్చని అంచనా వేస్తున్నారు.కొత్త రైలు అందుబాటులోకి వస్తే సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులకు బస్సులతో పోలిస్తే చౌకైన ప్రయాణ సదుపాయం లభిస్తుంది. ముఖ్యంగా ఉప్పల్, ఘట్‌కేసర్, చర్లపల్లి, మౌలాలి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో నివసించే ఉత్తర తెలంగాణ ప్రజలకు తమ నివాస ప్రాంతాలకు సమీపంలోని స్టేషన్ల నుంచే రైలు ఎక్కే అవకాశం ఉంటుంది. దీనివల్ల నగరంలోని రద్దీ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు రోడ్డు ప్రయాణంపై ఆధారపడటం కూడా తగ్గుతుంది. కరీంనగర్, పెద్దపల్లి, కాజీపేట, సికింద్రాబాద్ మధ్య విద్యా, ఉద్యోగ, వ్యాపార సంబంధాలు మరింత బలోపేతమవుతాయి. హైదరాబాద్‌లో పనిచేస్తూ స్వగ్రామాలకు తరచూ వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులకు ఈ రైలు సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఇప్పటికే రైల్వే మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని రైల్వే శాఖ నమో భారత్ లేదా మెము రైలు ప్రతిపాదనను పరిశీలించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

కొండగట్టులో అపురూప ఘట్టం..

ఆరు దశాబ్దాల తర్వాత అంజన్న దర్శన భాగ్యం

- విజయవంతంగా ముగిసిన చందనోత్సవ ప్రక్రియ

- డిసెంబర్ 29 వరకు భక్తులకు దర్శన భాగ్యం

- భద్రాచలం పట్టువస్త్రాలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ

- దర్శించుకున్న స్పీకర్, మంత్రులు, పలువురు ప్రముఖులు



జగిత్యాల :జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో అరుదైన చందనోత్సవం శుక్రవారం ముగిసింది. సుమారు 60 ఏళ్ల తర్వాత భక్తులకు స్వామివారి నిజరూప దర్శన భాగ్యం లభించింది. ఈ అపురూప ఘట్టాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివస్తున్నారు. గత ఆరు దశాబ్దాలుగా స్వామివారి మూలవిరాట్టుపై పేరుకుపోయిన చందనం పొరను తొలగించే ప్రక్రియను ఆలయ అధికారులు, అర్చకులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ నెల 15న ప్రత్యేక పూజలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం 18వ తేదీ సాయంత్రం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రతిరోజూ హోమాలు, విశేష పూజలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా బంగారం, వెండి, చెక్క పరికరాలను వినియోగించి స్వామివారి చందనాన్ని తొలగించారు. చందనాన్ని తొలగించిన అనంతరం పంచనదుల జలాలు, సముద్రపు నీటితో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం సుగంధ ద్రవ్యాలతో అభిషేకించి, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి తీసుకొచ్చిన పట్టువస్త్రాలతో స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. సంప్రదాయబద్ధంగా ముందుగా అద్దంలో స్వామివారి రూపాన్ని ప్రతిబింబింపజేసి, ఆ తర్వాత అర్చకులు, భక్తుల దర్శనానికి అనుమతించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి ఆడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. స్వామివారి నిజరూప దర్శనం డిసెంబర్ 29 వరకు భక్తులకు అందుబాటులో ఉంటుందని అర్చకులు వెల్లడించారు. చివరిసారిగా 1965లో ఈ చందనోత్సవం జరగ్గా, సుమారు ఆరు దశాబ్దాల తర్వాత లభించిన ఈ అపురూప దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది.

అనిరుధ్ రెడ్డి... కోమటిరెడ్డిపై

చర్యలు ఉంటాయా

హైదరాబాద్, నవంబరు 21:ఒక రాష్ట్రంలో ఒక ప్రభుత్వం అధికారంలో ఉంటే.. ప్రతిపక్షం విమర్శలు చేస్తుంది. ఆరోపణలు చేస్తుంది. నిరసనలు చేపడుతుంది. ఆందోళనలకు పిలుపునిస్తుంది. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఇందుకు భిన్నంగా జరుగుతోంది. అధికార పార్టీ మీద అధికార పార్టీ ఎమ్మెల్యేలు.. ముఖ్యంగా ముఖ్యమంత్రి నాయకత్వం మీద ఎమ్మెల్యేలు.. ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరసనలు చేపడుతున్నారు. బహిరంగ సమావేశాలలో కీలకమైన వ్యాఖ్యలు చేస్తున్నారు.ఒకవేళ ఇలాంటి పరిస్థితి గనుక భారత రాష్ట్ర సమితిలో ఉండి ఉంటే కేసిఆర్ తన్ని తరిమేసేవాడు. అప్పట్లో ఈటల రాజేందర్ గులాబీ పార్టీకి ఓనర్లు మేము అన్నందుకు కేసిఆర్ బయటికి పంపించాడు. దానికంటే ముందు తాటికొండ రాజయ్య వ్యవహార శైలి మీద అభియోగాలు రావడంతో మంత్రివర్గం నుంచి కెసిఆర్ తొలగించారు. కానీ కాంగ్రెస్ పార్టీకి ఇది చేతకాదు. పైగా అధిష్టానం దగ్గర లాబీయింగ్ చేసుకునే వాళ్లకు బ్రహ్మాండంగా పదవులు ఉంటాయి. ఇటీవల కాలంలో రేవంత్ రెడ్డి మీద.. అప్పటి మంత్రి కొండా సురేఖ.. ఆమె కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలలో సంచలనం సృష్టించాయి. సుస్మిత చేసిన వ్యాఖ్యల పట్ల అనేక రకాలుగా చర్చలు.. ఇతర సంప్రదింపులు జరిపిన అధిష్టానం ఎట్టకేలకు రేవంత్ రెడ్డి ఒత్తిడి తీసుకొస్తే సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించింది.ఇక అప్పటినుంచి సురేఖ పార్టీ కార్యక్రమాలలో పాల్గొనడం లేదు. పైగా గులాబీ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు క్షమాపణ చెప్పారు. అప్పటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా అలా వ్యవహరించాల్సి వచ్చిందని ఆమె వివరించారు. ఇక కొండా సురేఖ మాదిరిగానే జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి.. మరో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి మీద విమర్శలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ.. ప్రజలు ప్రభుత్వం తీరుపై సంతృప్తిగా లేరని ఆయన అనేక సందర్భాలలో విమర్శలు చేస్తున్నారు. తాజాగా కూడా ముఖ్యమంత్రి నేరుగా ప్రస్తావిస్తూ రాజగోపాల్



రెడ్డి విమర్శలు చేశారు. గతంలో ముఖ్యమంత్రిని విమర్శించినందుకే కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించారు. అనిరుధ్ రెడ్డి.. రాజగోపాల్ రెడ్డి మీద కాంగ్రెస్ పార్టీ అధిష్టానం చర్యలు తీసుకుంటుందా.. అలాంటి అవకాశం ఉందా అనే చర్చ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా నడుస్తోంది.రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలకు సహజంగానే నమస్తే తెలంగాణ ప్రాధాన్యం ఇచ్చింది. టీ న్యూస్ నిన్నటి నుంచి ఈ వ్యవహారాన్ని గొప్పగా ప్రచారం చేసుకుంటున్నది. అయితే కొంతమంది మాత్రం రాజగోపాల్ రెడ్డి గులాబీ పార్టీ కండువా కప్పుకుంటున్నారని అంటున్నారు. మరికొందరేమ వైసీపీలో చేరి.. తెలంగాణ అధ్యక్షుడిగా పనిచేస్తారని చెబుతున్నారు. అందువల్లే ఆయన రేవంత్ రెడ్డి మీద విమర్శలు చేస్తున్నారని చెబుతున్నారు. వాస్తవానికి ఇటీవల నల్గొండలో జరిగిన ఒక సమావేశంలో రాజగోపాల్ రెడ్డి రేవంత్ రెడ్డి ని కలిశారు. వేదిక మీద కుశల ప్రశ్నలు వేసుకొని కనిపించారు. దీనిని గులాబీ పార్టీ అనుకూల సోషల్ మీడియా గ్రూపులో నెగిటివ్గా ప్రచారం చేసాయి. రాజగోపాల్ రెడ్డి ఒక అడుగు వెనక వేశారని చెప్పుకొచ్చాయి. కానీ యాదృచ్ఛికంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడిన మాటలకు నిన్నటి నుంచి ప్రాధాన్యం ఇవ్వడం మొదలుపెట్టాయి. ఒకవేళ చర్యలు తీసుకుంటే అనిరుద్ రెడ్డి.. రాజగోపాల్ రెడ్డి ఏ పార్టీలోకి వెళ్తారు అనే చర్చ నడుస్తోంది. అనిరుద్ రెడ్డి ఓపెన్ గా మాట్లాడతారు. గులాబీ పార్టీలో కొంతమందికి మినహా మిగతా వారికి అంతర్గత స్వేచ్ఛ ఉండదు. అలాంటి పార్టీలో అనిరుద్ రెడ్డి ఉంటారా అనేది ఒక అనుమానం. ఇక రాజగోపాల్ రెడ్డి కూడా అలాంటి తరహా వ్యక్తిత్వం ఉన్న నాయకుడే. గతంలో ఆయన మునుగోడు ఉప ఎన్నికలు వచ్చినప్పుడు కమలం పార్టీలో చేరారు. 2023లో కాంగ్రెస్లో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్ నుంచి కమలం పార్టీలోకి వెళ్లే అవకాశం లేదు. ఒకవేళ గులాబీ పార్టీలోకి వెళితే అప్పుడు ఆయన చేసిన విమర్శలకు సార్థకత ఉండదు. మొత్తంగా చూస్తే అధిష్టానం వీరిద్దరి మీద చర్యలు తీసుకోకుండా పొమ్మను లేక పొగ పెట్టే సామెతను నిజం చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

మోదీ, షా, ఒవైసీది ఒకటే జట్టు..

- మొదటి పేజీ తరువాయి

ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్ నేత ఆజం ఖాన్ చేసిన 'హైదరాబాదీ బిర్యానీ' వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఒవైసీ రాజకీయాలు ఒక ప్రాంతానికే పరిమితమని పరోక్షంగా ఎద్దేవా చేశారు.తెలంగాణలో బీజేపీకి ఏమాత్రం బలం లేదని, రాష్ట్రంలో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ మాత్రమే ప్రధాన ప్రత్యర్థి అని రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ డిపాజిట్ కోల్పోయిన విషయాన్ని గుర్తుచేశారు. "నిజంగా ధైర్యం ఉంటే, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి అసదుద్దీన్ ఒవైసీని ఓడించాలి" అని సవాల్ విసిరారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్‌పైనా రేవంత్ తన విమర్శల దాడిని కొనసాగించారు. మాజీ సీఎం కేసీఆర్‌ను 'రావణాసురుడు'గా, కేటీఆర్‌ను 'మేనేజ్‌మెంట్ కోటా' నేతగా అభివర్ణించారు. అదే సమయంలో, లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాబల్యం తగ్గిపోతుందని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు.

పార్టీ లైన్ దాటితే చర్యలు తప్పవు..

- మొదటి పేజీ తరువాయి

నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అభివృద్ధి అంటే కేవలం కొడంగల్, మధిర, హుజూర్‌నగర్ నియోజకవర్గాలే కాదని దుయ్యబట్టారు. మునుగోడు అభివృద్ధిని పట్టించుకోవడం లేదని రాజగోపాల్ రెడ్డి ఆరోపించారు.అంతేకాదు, నిధులు ఇవ్వకుంటే మరో కురుక్షేత్రం తప్పదని ఆయన హెచ్చరించారు. ఇదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో రెండేళ్లే పదవిలో ఉంటారని వ్యాఖ్యలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అలాగే, అదృష్టం కొద్దీ దక్కిన అధికారంతో అవినీతికి పాల్పడే పాలకులను తెలంగాణ ప్రజలు, చరిత్ర ఎన్నటికీ క్షమించదని రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. సిద్ధిపేట సభలో సీఎం రేవంత్ రెడ్డి తనను ఉద్దేశించి పరోక్షంగా చేసిన వ్యాఖ్యలకు ఆయన పై విధంగా కౌంటర్ ఇచ్చారు.ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జిగా నియమితులైన బి.ఎం.సందీప్ ఆదివారం(నవంబరు 22న) హైదరాబాద్‌కు రానున్నారు. గాంధీభవన్‌లో జరగనున్న రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ), ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ)ల ఉమ్మడి సమావేశంలో ఆయన పాల్గొంటారు. తర్వాత నవంబరు 23న సోమవారం గాంధీభవన్‌లో ఉదయం మంత్రులతో, మధ్యాహ్నం నుంచి డీసీసీ అధ్యక్షులు, పీసీసీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో సమావేశమవుతారు.

కనీసం సెక్రటరీనే లేడు.. నువ్వేం ఇండస్ట్రీలను ఆకర్షిస్తావ్..

- మొదటి పేజీ తరువాయి

ఇండస్ట్రీ డిపార్ట్‌మెంట్‌కు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండాలి.. ఐటీ డిపార్ట్‌మెంట్‌కు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీ ఉండాలి.. చీఫ్ సెక్రటరీని ఇన్‌చార్జ్‌గా పెట్టి నడిపిస్తున్నరు.. ఆ చీఫ్ సెక్రటరీకి సవాలక్ష పనులుంటాయి.. ఆయన ఏం టైం ఇవ్వగలుగుతడు.. ఆయన పరిశ్రమలకు, పారిశ్రామిక వేత్తలకు టైం ఇవ్వగలుగుతడా..? ఐటీ కంపెనీలకు టైం ఇవ్వగలుగుతడా..? మీ పాలన ఎట్లుందంటే ఇండస్ట్రీకి, ఐటీకి కనీసం ఒక సెక్రటరీని కూడా అపాయింట్ చేయని పరిపాలన.. మీ కాంగ్రెస్ పాలన. ఇక మీరు హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ గురించి మాట్లాడుతురన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం

- మొదటి పేజీ తరువాయి

మరింత వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించామని అన్నారు.ఉద్యమకారుల వివరాల నమోదు, గుర్తింపు ప్రక్రియ కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వెబ్‌సైట్ ప్రస్తుత స్థితిని సమీక్షించి, వీలైనంత త్వరగా వెబ్‌సైట్‌ను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించాం. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు కల్పించడమే మా లక్ష్యం. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేందుకు కమిటీ తరఫున అన్ని విధాలుగా కృషి చేస్తాం. వెబ్‌సైట్ ఏర్పాటుపై తదుపరి పురోగతిని త్వరలోనే సమీక్షించి, ప్రారంభ తేదీతో పాటు తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు.

తెలంగాణకు సఫ్రాన్ భారీ పెట్టుబడి..

- మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో మరిన్ని తయారీ కార్యకలాపాలను చేపట్టేందుకు సంస్థ ఆసక్తి కనబరచడం రాష్ట్ర పారిశ్రామిక రంగానికి ప్రాధాన్యత సంతరించుకుంది.

డిసెంబర్ గ్లోబల్ సమ్మిట్‌లో ఎంఓయూపై ఆశలు..

తెలంగాణలో పెట్టుబడి ప్రతిపాదనకు సంబంధించి డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో సఫ్రాన్‌తో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ సదస్సుకు హాజరుకావాలని సఫ్రాన్ ప్రతినిధి బృందాన్ని భట్టి విక్రమార్క ఆహ్వానించారు. ప్రతిపాదిత రూ.4,000 కోట్ల పెట్టుబడి కార్యరూపం దాలిస్తే తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగాల తయారీ సామర్థ్యానికి మరింత బలం చేకూరనుంది.

అగ్రిగోల్డ్ బాధితులకు బాండ్ల వెరిఫికేషన్ షెడ్యూల్ విడుదల

రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలు, మండలాల వారీగా తేదీలు, కేంద్రాల వివరాలు ప్రకటించిన సీఐడీ

రూ.447 కోట్ల కుంభకోణం.. 1.65 లక్షల మంది బాధితులకు వెరిఫికేషన్

హైదరాబాద్,నవంబర్ 21:అగ్రిగోల్డ్ డిపాజిటర్లకు సంబంధించిన బాండ్ పత్రాల వెరిఫికేషన్ ప్రక్రియకు తెలంగాణ సీఐడీ శాఖ డైరెక్టర్ షెడ్యూల్ విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలు, మండలాల వారీగా వెరిఫికేషన్ తేదీలు, కేంద్రాలు, వెరిఫికేషన్ నిర్వహించే అధికారుల వివరాలను ప్రకటించింది.అగ్రిగోల్డ్‌కు సంబంధించిన సుమారు రూ.447 కోట్ల కుంభకోణంలో ఇప్పటికే ముగ్గురు నిందితులను సీఐడీ అరెస్టు చేసింది. ఈ వ్యవహారంలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.65 లక్షల మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. బాధితులకు సంబంధించిన డిపాజిట్ బాండ్ పత్రాలు, ఇతర ఆధారాల పరిశీలన కోసం ప్రత్యేకంగా వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపడుతోంది.ఈ మేరకు జిల్లాలు, మండలాల వారీగా వెరిఫికేషన్ తేదీలు, నిర్వహించే ప్రదేశాలు, బాధ్యతలు నిర్వర్తించే అధికారుల వివరాలతో కూడిన సమగ్ర షెడ్యూల్‌ను సీఐడీ విడుదల చేసింది. వెరిఫికేషన్‌కు హాజరయ్యే బాధితులు తప్పనిసరిగా తమ వద్ద ఉన్న అగ్రిగోల్డ్ డిపాజిట్ బాండ్ పత్రాలు, సంబంధిత రశీదులు, గుర్తింపు కార్డులు తదితర అవసరమైన ఆధారాలను తీసుకురావాలని సూచించింది.బాధితులు తమకు కేటాయించిన తేదీ, వెరిఫికేషన్ కేంద్రం వివరాలను పరిశీలించి, నిర్ణీత సమయంలో సంబంధిత అధికారుల ఎదుట హాజరుకావాలని సీఐడీ కోరింది. అగ్రిగోల్డ్ బాధితులందరికీ ఈ సమాచారాన్ని చేరవేయడంతో పాటు వెరిఫికేషన్ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మీడియా సంస్థలు విస్తృత ప్రచారం కల్పించాలని విజ్ఞప్తి చేస్తుంది.

శ్రీవారి ఆలయంలో వైభవంగా కైశిక ద్వాదశి ఆస్థానం

తిరుమల : కైశిక ద్వాదశి పర్వదినం సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో శనివారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా వేకువ ఝామున 4.30 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు.వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ సాధికారిక మండలి చైర్మన్, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, జేఈవో డాక్టర్ శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వివిధ అభివృద్ధి పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలి

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి

హనుమకొండ కుడా కార్యాలయంలో కుడా పరిధిలోని వివిధ అభివృద్ధి అంశాలు, పనుల పురోగతిపై కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో ఎంపీ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ ఛైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమావేశం



హనుమకొండ నవంబర్ 21 అక్షర సవాల్ : వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి అన్నారు. శనివారం హనుమకొండ కుడా కార్యాలయంలో కుడా పరిధిలోని వివిధ అభివృద్ధి అంశాలు, పనుల పురోగతిపై కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి అధ్యక్షతన పురావస్తు, కుడా అధికారులతో ఎంపీ కడియం కావ్య, హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ ఛైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమావేశమయ్యారు ఈ సందర్భంగా కుడా పరిధిలోని అభివృద్ధి పనులు, భూసేకరణ ప్రక్రియ పురోగతి పై ఎంపీ డాక్టర్ కడియం కావ్య, కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ..ఖిలా వరంగల్ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేచర్యలను వేగవంతం చేయాలన్నారు. ఖిలా వరంగల్ ప్రాంతంను అభివృద్ధి చేయడం ద్వారా పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని, పర్యాటకంగా వరంగల్ కు మరింత పేరొస్తుందన్నారు. చారిత్రక వరంగల్ పరిధిలోని పురాతన దేవాలయాల అభివృద్ధికి కావాల్సిన చర్యలు చేపట్టాలన్నారు. వరంగల్ సంస్కృతి, గొప్పధనం చాటిచెప్పేందుకు పురావస్తు శాఖ మరింత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కుడా ఛైర్ పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ ఖిలా వరంగల్ అభివృద్ధికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి పనులను వేగవంతం చేయాలన్నారు. ఇందుకు పురావస్తు శాఖ నుండి అనుమతుల మంజూరు త్వరగా జరగాలన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, కుడా వైస్ ఛైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. ఖిలా వరంగల్ లో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు, అనుమతులు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని పురావస్తు శాఖ అధికారులకు సూచించారు. ఖిలా వరంగల్ రాతి కోట పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని పురావస్తు శాఖ అధికారులకు సూచించారు. వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఖిలా వరంగల్ కోట పరిధిలో కాకతీయ కాలం నాటి ఆలయాలు ఉన్నాయని, వాటిని అందుబాటులోకి తీసుకురావాలని పురావస్తు అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వరంగల్ డీఆర్వో విజయలక్ష్మి, కుడా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాభాయి, సీపీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు, పురావస్తు శాఖ డీఈ కృష్ణ చైతన్య, లియో ప్రాజెక్ట్ ప్రతినిధి ఆనంద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కేంద్ర మంత్రి 4 సూటి ప్రశ్నలు..

రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై తీవ్ర దుమారం

- కాంగ్రెస్ పార్టీని నాలుగు ప్రశ్నలు అడిగిన కేంద్ర మంత్రి రిజిజు

- 1962 చైనా యుద్ధ అవమానానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్

- భారత్‌ను ఎందుకు పేద దేశంగా ఉంచారో చెప్పాలన్న మంత్రి

- దేశ ఆర్థిక వ్యవస్థను అవమానించారంటూ కాంగ్రెస్‌కు ప్రశ్నలు

- ఏపెక్ త్రైపాక్షిక భేటీపై ప్రధాని మోదీని విమర్శించిన రాహుల్



కాంగ్రెస్ పార్టీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లక్ష్యంగా కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 1962 నాటి యుద్ధ అవమానానికి కాంగ్రెస్ క్షమాపణ చెబుతుందా? అని ప్రశ్నిస్తూ శనివారం ఆయన నాలుగు సూటి ప్రశ్నలను సంధించారు. చైనాలో జరిగిన ఏపెక్ సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీపై ప్రధాని మోదీని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై రిజిజు మండిపడ్డారు.ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించిన రిజిజు.. 1962 భారత్–చైనా యుద్ధంలో తమ గ్రామాన్ని చైనా ఆక్రమించిందని గుర్తుచేశారు. ఆ చారిత్రక అవమానానికి కాంగ్రెస్ ఎప్పుడు క్షమాపణ చెబుతుందని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో భారత్‌ను ఎందుకు పేద దేశంగా ఉంచారో సమాధానం చెప్పాలన్నారు. మన దేశాన్ని 'పాములు ఆడించేవారి దేశం'గా ఎందుకు ప్రచారం చేశారో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భారత ఆర్థిక వ్యవస్థను 'హిందూ రేట్ ఆఫ్ గ్రోత్' అంటూ ఎందుకు అవమానించారో కాంగ్రెస్ చెప్పాలని ప్రశ్నించారు.అంతకుముందు రాహుల్ గాంధీ స్పందిస్తూ, కాంగ్రెస్ అధికారంలో ఉండి ఉంటే ఆ అగ్రరాజ్యాల అధినేతల టేబుల్ వద్ద భారత ప్రధాని కూర్చుని ఉండేవారని వ్యాఖ్యానించారు. రాజీపడిన ప్రధాని ఎప్పటికీ అక్కడ కూర్చోలేరంటూ విమర్శించారు. ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన రిజిజు, రాహుల్ దేశంలో ఉన్నా, విదేశాలకు వెళ్లినా భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. విదేశీ భారత వ్యతిరేక శక్తులతో ఆయన చేతులు కలిపారని, భారత ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

ఏపీ వ్యూహాలు దక్షిణాధి రాష్ట్రాల్లోచర్చ

అమరావతి, నవంబరు 31:పెట్టుబడుల వేటలో దూసుకెళుతున్న ఆంధ్రప్రదేశ్.. రెండేళ్లలోనే తొమ్మిదో స్థానం నుంచి రెండో స్థానానికి.. రూ.32.49 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు.. తమిళనాడులో డేటా లీక్ ఆరోపణల కలకలం.. అభివృద్ధి పోటీలో ఏపీ దూకుడును తట్టుకోలేకపోతున్నాయా పొరుగు రాష్ట్రాలు? ఇప్పుడు ఇవే దేశవ్యాప్తంగా పొరుగు రాష్ట్రాల్లో ఏపీ గురించి నడుస్తున్న చర్చ..ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ ఆర్థిక వెన్నెముకగా ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత ఆ నగరాన్ని కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన వంటి అంశాలు అతిపెద్ద సవాళ్లుగా మారాయి. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న రాష్ట్రం.. ఇప్పుడు పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోని అగ్రగామి రాష్ట్రాలకు గట్టి పోటీ ఇస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ అనుసరిస్తున్న దూకుడైన విధానాలు ఏపీకి కొత్త గుర్తింపును తీసుకొస్తున్నాయి.అయితే ఏపీ సాధిస్తున్న ఈ పురోగతి ఇప్పుడు కేవలం రాష్ట్రానికే పరిమితమైన అంశంగా కనిపించడం లేదు. దక్షిణాదిలో పారిశ్రామికంగా బలంగా ఉన్న తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లోనూ చర్చకు దారితీస్తోంది. పెట్టుబడుల కోసం ఒకప్పుడు ఏపీ ఇతర రాష్ట్రాలతో పోటీ పడాల్సి వస్తే.. ఇప్పుడు ఏపీ వైపు పెట్టుబడులు మళ్లడం పొరుగు రాష్ట్రాల్లో అసౌకర్యానికి కారణమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా కొత్త ప్రాజెక్టుల ప్రకటనల్లో ఆంధ్రప్రదేశ్ వాటా గణనీయంగా పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3.01 శాతంగా ఉన్న ఏపీ వాటా.. 2025-26 నాటికి ఏకంగా 15.36 శాతానికి చేరింది. దీంతో దేశవ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో ఉన్న రాష్ట్రం రెండో స్థానానికి ఎగబాకింది.ఇదే సమయంలో కర్ణాటక పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. 2023-24లో 8.25 శాతంగా ఉన్న ఆ రాష్ట్ర వాటా 2025-26 నాటికి 5.67 శాతానికి పడిపోయింది. జాతీయ స్థాయిలో నాలుగో స్థానం నుంచి ఆరో స్థానానికి దిగజారింది.ఈ గణాంకాలు దక్షిణాది రాష్ట్రాల మధ్య పెట్టుబడుల ఆకర్షణలో మారుతున్న సమీకరణాలను స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ మార్పునకు ఒక్క కారణమే ఉందని చెప్పలేం. ప్రభుత్వ విధానాలు, మౌలిక సదుపాయాలు, భూమి లభ్యత, అనుమతుల వేగం, పారిశ్రామిక అవసరాలు వంటి అనేక అంశాలు పెట్టుబడుల నిర్ణయాలను ప్రభావితం చేస్తాయిపెట్టుబడుల విషయంలో ఆంధ్రప్రదేశ్ దూకుడుకు విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026 మరో ఉదాహరణగా నిలిచింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు ముగిసే సమయానికి రాష్ట్రానికి రూ.9,88,957 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. మొత్తం 303 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా 3,48,309 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం వెల్లడించింది.ఈ పెట్టుబడుల్లో అక్టోబర్ 7 నుంచి 26 వరకు జరిగిన ప్రాంతీయ సమావేశాల్లో 194 ఎంవోయూల ద్వారా రూ.86,522 కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు వచ్చాయి. వీటి ద్వారా 1,47,951 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.విశాఖ సదస్సులో మరో 109 ఒప్పందాలు కుదిరాయి. వీటి విలువ రూ.9,02,434 కోట్లు కాగా, సుమారు 2,00,358 ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని అంచనా.ఇక 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి అందిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనలు రూ.32.49 లక్షల కోట్లకు చేరినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ సంఖ్యలు కేవలం పెట్టుబడుల ప్రకటనలే అయినప్పటికీ, దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వర్గాల దృష్టిని ఏపీ ఆకర్షిస్తోందనే సంకేతాన్ని ఇస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల వేటలో కనిపిస్తున్న వేగం వెనుక రాజకీయ నాయకత్వం అనుసరిస్తున్న వ్యూహం కీలకంగా కనిపిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌ను కోల్పోయిన ఏపీకి పారిశ్రామికంగా కొత్త పునాది వేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంపై దృష్టి పెట్టింది.పరిశ్రమలకు అవసరమైన భూములు, మౌలిక సదుపాయాలు, వేగవంతమైన అనుమతులు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామనే హామీలతో పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తోంది. మరోవైపు మంత్రి నారా లోకేశ్ పెట్టుబడిదారులతో నేరుగా సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాన్ని కేవలం పెట్టుబడుల సేకరణగా కాకుండా.. రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణ ప్రయత్నంగా చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే పెట్టుబడులు వస్తేనే పరిశ్రమలు ఏర్పడతాయి. పరిశ్రమలు వస్తేనే స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయి. ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తేనే రాష్ట్ర ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందిఇక్కడే అసలు ఆసక్తికరమైన రాజకీయ, పారిశ్రామిక పరిణామం చోటుచేసుకుంది. దక్షిణాదిలో పారిశ్రామికంగా బలమైన రాష్ట్రంగా పేరున్న తమిళనాడులో పెట్టుబడుల వ్యవహారం వివాదానికి దారితీసింది.తమిళనాడులోని విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం, పెట్టుబడుల ఆకర్షణకు కీలకమైన గైడెన్స్ తమిళనాడు సంస్థలోని 15 మంది అధికారులను తొలగించినట్లు వార్తలు వచ్చాయి. ఆ సంస్థకు సంబంధించిన కీలక పెట్టుబడి సమాచారాన్ని కొందరు ఆంధ్రప్రదేశ్‌కు చేరవేశారనే అనుమానాలు ఈ వ్యవహారానికి కారణమని ప్రచారం జరిగింది.ముఖ్యంగా గైడెన్స్ తమిళనాడులో గతంలో పనిచేసిన ముగ్గురు ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డులో చేరడం ఈ వివాదానికి కేంద్రంగా మారింది.అయితే ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. ఒక రాష్ట్రంలో పనిచేసిన ఉద్యోగులు మరో రాష్ట్రంలో ఉద్యోగాలు పొందడం సాధారణమైన పరిణామమే. సంబంధిత ఉద్యోగుల వాదన ప్రకారం, తమ ఒప్పందాల్లో ఇతర సంస్థల్లో పనిచేయకుండా నిరోధించే నిబంధనలు లేవు. అంతేకాకుండా, వారు వివాదం తెరపైకి రాకముందే సంస్థను వీడినట్లు చెబుతున్నారు.ఇప్పటివరకు పెట్టుబడుల సమాచారాన్ని దొంగిలించారనే ఆరోపణలకు సంబంధించి బహిరంగంగా నిరూపితమైన ఆధారాలు వెలుగులోకి రాలేదు. ఈ వివాదంపై తమిళనాడులోని ప్రతిపక్ష డీఎంకే కూడా స్పందిస్తూ, దశాబ్దాల చరిత్ర ఉన్న సంస్థను రాజకీయ వివాదంలోకి లాగడంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి.ఈ వివాదాన్ని మరో కోణంలో పరిశీలిస్తే అసలు ప్రశ్న ఉద్యోగుల బదిలీ గురించి కాదు.. పెట్టుబడులను ఆకర్షించే విషయంలో రాష్ట్రాల మధ్య పెరుగుతున్న పోటీ గురించి.ఒక రాష్ట్రంలో పనిచేసిన అనుభవజ్ఞులైన ఉద్యోగులు మరో రాష్ట్రానికి వెళ్లడం ద్వారా తమ నైపుణ్యాన్ని, అనుభవాన్ని కొత్త సంస్థకు అందించవచ్చు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆన్‌లైన్ ప్రక్రియ తనిఖీ



నల్లబెల్లి నవంబర్ 21 అక్షర సవాల్:నల్లబెల్లి మండలంలోని కొండాయిలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను జిల్లా పరిషత్ సీఈవో వసంత, జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ అధికారి నాగ పద్మజ తనిఖీ చేసి వారికి తగిన సూచనలు చేశారు ప్రభుత్వం ఇచ్చిన సమయము కంటే ముందే ప్రక్రియను పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్రంలోని ప్రథమ స్థానంలో నిలుపాలని అన్నారు ఈ కార్యక్రమంలో నర్సంపేట ఆర్టీవో ఉమారాణి తహసిల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీడీఓ పింగిలి రమణారెడ్డి గ్రామస్థాయి అధికారులు ప్రతినిధులు గ్రామస్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

నరెడ్ల పద్మక్క మృతి వ్యక్తిగతంగా తీరని లోటు

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్



హన్మకొండ, నవంబర్ 21,అక్షర సవాల్ : పెగడపల్లి మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్ అధ్యక్షులు నరెడ్ల శ్రీధర్ గారి మాతృమూర్తి, మా సోదరిమణి నరెడ్ల పద్మక్క మృతి వ్యక్తిగతంగా తీరని లోటని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ గారు ఆవేదన వ్యక్తం చేశారు. వారు పెగడపల్లిలోని వారి స్వగృహం నందు శనివారం రోజున స్వర్గస్థులు కాగా... దాస్యం వినయ్ భాస్కర్ గారు పద్మక్క గారి పార్థివ దేహాన్ని సందర్శించి బాధాతప్త హృదయంతో నివాళులు అర్పించారు. పుష్పాంజలి ఘటించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం మేనల్లుడు శ్రీధర్ గారిని, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్యపడవద్దని భరోసానిచ్చారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన కాంగ్రెస్ నాయకులు



నల్లబెల్లి, నవంబర్ 21అక్షర సవాల్:నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన రాకేష్--వెన్నెల వివాహ వేడుకకు కాంగ్రెస్ నాయకులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మాలోత్ రమేష్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి చిట్యాల తిరుపతి రెడ్డి మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, పీఏసీఎస్ డైరెక్టర్ జిల్లా మునేందర్, గుండ్లపాడు సర్పంచ్ కదురు లలిత శ్రీనివాస్, మాజీ గ్రామ అధ్యక్షుడు బత్తిని మహేష్, కొండలై అశోక్, గాజు బిక్షపతి తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహకార సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి



నల్లబెల్లి నవంబర్ 21 అక్షర సవాలు:రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలని రైతు సంఘం మండల కార్యదర్శి మామిండ్ల పెద్ద ఐలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లబెల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడువు ముగిసిన సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ పాలకవర్గాలను ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. హైకోర్టు సూచనల మేరకు వెంటనే ఎన్నికలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరికి కోర్నేలు, కడియాల క్రాంతికుమార్, మూటికె కుమారస్వామి, సామాల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లి సావిత్రీ దేవికి కన్నీటి వీడ్కోలు

- ఉత్తరాఖండ్‌లోని పంచూర్ గ్రామంలో తల్లి పాడె మోసిన సీఎం

- 91 ఏళ్ల వయసులో శుక్రవారం కన్నుమూసిన సావిత్రీ దేవి

- అమ్మను మించిన రక్షణ, ప్రేమ లేవంటూ యోగి భావోద్వేగ పోస్ట్

- హరిద్వార్‌లోని చండీ ఘాట్‌లో అంత్యక్రియలు



ఉత్తరాఖండ్: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన తల్లి సావిత్రీ దేవి అంత్యక్రియల్లో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. ఉత్తరాఖండ్‌లోని పౌరీ గఢ్వాల్ జిల్లా పంచూర్ గ్రామంలోని తమ పూర్వీకుల నివాసంలో శనివారం ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించారు. అమ్మ ప్రేమతో సమానమైనది ఈ సృష్టిలో ఏదీ లేదంటూ భావోద్వేగానికి లోనయ్యారు. తల్లి భౌతికకాయానికి పుష్పాంజలి ఘటించిన సీఎం యోగి, స్వయంగా పాడే మోశారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ.. తల్లిని మించిన నీడ, ఆశ్రయం, రక్షణ, ప్రేమ మరేదీ లేదని పేర్కొన్నారు. 91 ఏళ్ల సావిత్రీ దేవి శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో స్వగ్రామంలో కన్నుమూశారు. ఆ సమయంలో లక్నోలో అధికారిక కార్యక్రమంలో ఉన్న సీఎం యోగి, విషాదాన్ని దిగమింగుకుని షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను పూర్తి చేసుకున్నారు. అనంతరం ఉత్తరాఖండ్‌లోని స్వగ్రామానికి చేరుకుని కడసారి వీడ్కోలు పలికారు.

జీరో కట్స్‌తో సెన్సార్ పూర్తి చేసుకున్న సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'.. విడుదల ఎప్పుడంటే?



బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన 'మాతృభూమి' ('మాతృభూమి: మే వార్ రెస్ట్ ఇన్ పీస్') చిత్రం సెన్సార్ ప్రక్రియను పూర్తి చేసుకుంది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఈ చిత్రానికి ఖ/ూ 16+ సర్టిఫికెట్ జారీ చేసింది. ఎలాంటి కట్స్ సూచించకుండానే సినిమాకు క్లియరెన్స్ లభించడం విశేషం. ఈ చిత్రం మొత్తం నిడివి 2 గంటల 34 నిమిషాల 12 సెకన్లుగా ఖరారైంది. తొలుత నవంబర్ 20న విడుదల చేయాలనుకున్నప్పటికీ, కొన్ని కారణాలతో వాయిదా పడింది. తాజాగా ఈ చిత్రాన్ని డిసెంబర్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. 2020 గల్వాన్ లోయ ఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. దేశ రక్షణ కోసం పోరాడే సైనికాధికారి కల్నల్ సంతోష్ బాబు పాత్రలో సల్మాన్ ఖాన్ నటించగా, కుటుంబ బాధ్యతలను నిలబెట్టే భార్య పాత్రలో చిత్రాంగదా సింగ్ కనిపించనున్నారు. వీరిద్దరి త్యాగం, భావోద్వేగాల చుట్టూ కథ సాగుతుంది. మొదట ఈ సినిమాను 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్' పేరుతో ప్రకటించగా, మార్చి 2026లో 'మాతృభూమి'గా మార్చారు. ప్రభుత్వ ఒత్తిడితో స్క్రిప్ట్‌లో మార్పులు చేశారన్న వార్తలను సల్మాన్ ఖాన్ ఖండించారు.

'దళపతి' సీన్ రీక్రియేట్ చేసిన అనిల్ రావిపూడి

వినూత్న ప్రమోషన్లతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడంలో దర్శకుడు అనిల్ రావిపూడి ఎప్పుడూ ముందుంటారు. తాజాగా తన కొత్త సినిమా 'జనవరి 12 విడుదల' ప్రమోషన్లను కూడా అదే తరహాలో ప్రారంభించారు. ఈ సినిమాలోని పాటల సందడిని రేపటి నుంచి మొదలుకానుందని వినూత్నంగా ప్రకటించారు.

దళపతి సినిమాలోని ఇందుకోసం సూపర్‌స్టార్ రజనీకాంత్, శోభన నటించిన 'దళపతి' సినిమాలోని ఓ ఫేమస్ సన్నివేశాన్ని నటి కృతిశెట్టితో కలిసి రీక్రియేట్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయగా.. అది నెట్టింట వైరల్‌గా మారింది. ఇది చూసిన నెటిజన్లు 'మళ్లీ కొత్త కాన్సెప్టా అనిల్ భయ్యా.. ఈ సారి రజనీసార్‌నే వాడేశారు'గా అంటూ కామెంట్స్ పెడుతున్నారు. కాగా ఇంతకముందు వివాహ భోజనంబు చిత్రంలోని సుత్తి వీరభద్రరావు, బ్రహ్మానందం మధ్య బీచ్‌లో జరిగే ఓ సన్నివేశాన్నిమ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్‌కుమార్‌తో రీక్రియేట్ చేశారు. వెంకటేశ్, కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో కీర్తి సురేశ్, కృతి శెట్టి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ మూవీని సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది.



మాస్ యాక్షన్ విందుతో బెల్లంకొండ 'టైసన్ నాయుడు' టీజర్.!



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రధాన పాత్రలో, దర్శకుడు సాగర్ కె. చంద్ర తెరకెక్కిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టైసన్ నాయుడు'. ఈ సినిమా టీజర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో పవర్‌ఫుల్ లుక్‌తో కనిపించనున్నారు. నేహా శెట్టి, ప్రగ్యా జైస్వాల్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాలో నరేష్, రావు రమేష్, సునీల్ తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'మదరాసి రబ్బరు బొమ్మ' పాటకు మంచి స్పందన లభించగా, తాజా టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. త్వరలోనే చిత్ర విడుదల తేదీపై మేకర్స్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

మెన్స్ డే స్పెషల్.. 'రాపో23' ప్రీ-లుక్ వైరల్!

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన కెరీర్‌లోనే ఒక పెద్ద సాహసానికి సిద్ధమయ్యారు. ఇప్పటివరకు హీరోగా అలరించిన ఆయన, ఇప్పుడు తొలిసారిగా కథ రాసి, దర్శకత్వం వహిస్తూ నటిస్తున్న 'రాపో23' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా, నియో-నోయిర్ శైలిలో రూపొందుతున్న ఈ సినిమాపై ఆరంభం నుంచే మంచి ఆసక్తి నెలకొంది.

నేడు అంతర్జాతీయ పురుషుల దినోత్సవం (ఇంటర్నేషనల్ మెన్స్ డే) సందర్భంగా రామ్ పోతినేని ఈ సినిమా నుంచి ఒక ఆసక్తికరమైన ప్రీ-లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. "ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వుల్ఫ్" అనే క్యాప్షన్‌తో వచ్చిన ఈ పోస్టర్‌లో రామ్ తనదైన శైలిలో, కొత్త లుక్‌తో కనిపిస్తూ అభిమానుల్లో జోష్ నింపారు. తన దారిని తానే ఎంచుకుంటూ, ప్రపంచాన్ని ఒంటరిగా ఎదుర్కొనే స్వతంత్ర వ్యక్తిగా ఈ పాత్రను ఆయన పరిచయం చేశారు. ఈ పోస్టర్ ద్వారా అందరికీ మెన్స్ డే విషెస్ చెప్పిన చిత్రబృందం, త్వరలోనే సినిమా ఫస్ట్ లుక్ మరియు టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. దీంతో ఈ సినిమా టైటిల్ ఏంటి, టీజర్ ఎలా ఉండబోతుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్త మీనన్ కథానాయికగా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు రితేష్ దేశ్‌ముఖ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై రామ్ సోదరుడు కృష్ణ పోతినేని ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. సామ్ సి.ఎస్. సంగీతం అందిస్తుండగా, ఎస్. తిరునావుక్కరసు సినిమాటోగ్రఫీ బాధ్యతలు చూస్తున్నారు. దర్శకుడిగా, నటుడిగా రామ్ పోతినేని ఈ సినిమాతో ఎలాంటి కొత్త అనుభూతిని పంచుతారో చూడాలి.



20 రోజులకే ఓటీటీలోకి వచ్చేసిన విశ్వక్ సేన్ 'కల్ట్' స్ట్రీమింగ్ ఎందులో అంటే?



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ స్వీయ దర్శకత్వంలో నటించిన సైకలాజికల్ స్లాషర్ థ్రిల్లర్ 'కల్ట్' అనూహ్యంగా ఓటీటీలోకి వచ్చేసింది. థియేటర్లలో విడుదలైన కేవలం 20 రోజులకే ఈ చిత్రం డిజిటల్ స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి రావడం విశేషం. ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులో ఉంది. 2026 అక్టోబర్ 30న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, మిశ్రమ స్పందనల మధ్య థియేటర్ రన్ పూర్తి చేసుకున్న వెంటనే ఓటీటీలోకి అడుగుపెట్టింది. కథ విషయానికి వస్తే, ఒక భారీ పార్టీ వేదికగా మొదలైన సంబరం, వరుస హత్యలు మరియు ఉత్కంఠభరిత పరిణామాలతో ప్రమాదకరంగా మారుతుంది. ఆ పరిస్థితుల్లో డీఎస్పీ సంకల్ప్ నాయక్ పాత్రలో విశ్వక్ సేన్ ఎలాంటి సవాళ్లను ఎదుర్కొన్నారు, అసలు మిస్టరీ ఏంటి అనే ఆసక్తికర అంశాలతో ఈ స్లాషర్ థ్రిల్లర్ సాగుతుంది. విశ్వక్ సేన్ సరసన గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్‌గా నటించగా, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగార్, ప్రజ్ఞ కీలక పాత్రల్లో కనిపించారు. తరుణ్ భాస్కర్ సంభాషణలు అందించగా, రవి బస్రూర్ సంగీతం సమకూర్చారు. తారక్ సినిమాస్ ఎల్ఎల్పీ, వన్మయే క్రియేషన్స్ బ్యానర్లపై సందీప్ కాకరాల, కరాటే రాజు ఈ చిత్రాన్ని నిర్మించారు. థియేటర్లలో మిస్సయిన వారు లేదా కొత్త స్లాషర్ థ్రిల్లర్ జోనర్‌ను ఇష్టపడే ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రాన్ని వీక్షించవచ్చు.

బిజినెస్

స్టాక్ మార్కెట్లలో బుల్ రన్..
83,000 దాటిన సెన్సెక్స్, నిఫ్టీ జోరు!

సెన్సెక్స్ 989 పాయింట్లు పెరిగి 83,021 వద్ద ముగింపు
286 పాయింట్ల లాభంతో 25,514కు చేరిన నిఫ్టీ
ఆటో రంగం జోరు.. 4 శాతానికి పైగా పెరిగిన నిఫ్టీ ఆటో సూచీ
సరికొత్త ఆల్‌టైమ్ హై 63,053.25ను తాకిన నిఫ్టీ బ్యాంక్
విదేశీ పెట్టుబడులు, ముడిచమురు ధరల తగ్గింపు మార్కెట్లకు ఊతం



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో దూసుకెళ్లాయి. ఆటోమొబైల్, బ్యాంకింగ్, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ రంగాల షేర్లలో వెల్లువెత్తిన కొనుగోళ్ల మద్దతుతో ప్రధాన సూచీలు ఒక శాతానికి పైగా పుంజుకున్నాయి. సెన్సెక్స్ ఏకంగా 989.94 పాయింట్లు (1.21 శాతం) ఎగబాకి 83,021.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 286.35 పాయింట్లు (1.14 శాతం) లాభపడి తిరిగి 25,514.30 స్థాయిని చేరుకుంది. ఆటో రంగ షేర్లు మార్కెట్ ర్యాలీకి ప్రధాన చోదక శక్తిగా నిలిచాయి. నిఫ్టీ ఆటో సూచీ ట్రేడింగ్ సెషన్‌లో ఏకంగా 4 శాతానికి పైగా పెరిగి ట్రెండ్‌ను నడిపించింది. మారుతి సుజుకి, ఐషర్ మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు భారీ లాభాలతో ముందువరుసలో నిలిచాయి. అటు బ్యాంకింగ్ రంగం సైతం సరికొత్త చరిత్ర సృష్టించింది. నిఫ్టీ బ్యాంక్ సూచీ జీవితకాల గరిష్ఠ స్థాయి 63,053.25ను తాకి సరికొత్త రికార్డు నమోదు చేసింది. పీఎస్‌యూ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ షేర్లలోనూ కొనుగోళ్ల జోరు కనిపించింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (ఎఫ్ఐఐ) నిరంతర పెట్టుబడులు, అంతర్జాతీయంగా తగ్గుముఖం పట్టిన ముడిచమురు, రాగి ధరలు భారత మార్కెట్లకు బలమైన మద్దతుగా నిలిచాయి. అమెరికా ఫెడ్ వడ్డీ రేట్ల ఆందోళనలతో ఐటీ రంగం కాస్త ఒత్తిడికి లోనైనప్పటికీ, దేశీయ డిమాండ్‌తో ముడిపడి ఉన్న రంగాలపై మదుపర్లు ఆసక్తి చూపించారు. సాంకేతికంగా నిఫ్టీ 25,500 స్థాయిని దాటి నిలకడగా కొనసాగితే రాబోయే రోజుల్లో 25,800 నుంచి 26,000 స్థాయలను తాకే అవకాశం ఉందని, కింద వైపు 25,400 స్థాయి తక్షణ మద్దతుగా పనిచేస్తుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

రూ.7.5 లక్షల కోట్ల పండగ

పెళ్లిళ్ల సీజన్‌లో భారత ఆర్థిక వ్యవస్థకు సరికొత్త జోష్!

నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు 52 లక్షల వివాహాలు
దేశవ్యాప్తంగా రూ.7.5 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని సీఏఐటీ వెల్లడి
ఒక్క ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోనే రూ.2.5 లక్షల కోట్ల మేర లావాదేవీల అంచనా
కొనుగోళ్లలో రూ.1.2 లక్షల కోట్లతో బంగారు ఆభరణాలదే అగ్రస్థానం
వేదికలు, హోటళ్లు, మండపాల ద్వారా మరో రూ.60 వేల కోట్ల ఆదాయం



భారతదేశంలో మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న పెళ్లిళ్ల సీజన్ దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊపును తీసుకురానుంది. నవంబర్ 21 నుంచి డిసెంబర్ 15 వరకు కేవలం 25 రోజుల వ్యవధిలోనే దేశవ్యాప్తంగా సుమారు 52 లక్షల వివాహాలు జరగనున్నాయని అంచనా. వీటి ద్వారా ఏకంగా రూ.7.5 లక్షల కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు నమోదవుతాయని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) అంచనా వేసింది. ఈ ముహూర్తాల సీజన్.. రిటైల్, తయారీ, ఆతిథ్యం, రవాణా రంగాలకు అతిపెద్ద చోదక శక్తిగా మారనుందని వ్యాపారుల సమాఖ్య వెల్లడించింది. పెళ్లిళ్లు కేవలం శుభకార్యాలుగానే కాకుండా వ్యాపారులు, తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, చేతివృత్తుల కళాకారులు, సేవా రంగాలకు అండగా నిలిచే భారీ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందాయని సీఏఐటీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ఖండేల్‌వాల్ స్పష్టం చేశారు. ఒక్క ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోనే దాదాపు 5 లక్షల వివాహాలు జరగనుండగా, అక్కడ ఏకంగా రూ.2.5 లక్షల కోట్ల మేర వ్యాపారం సాగుతుందని అంచనా వేశారు. ఈ మొత్తం రూ.7.5 లక్షల కోట్ల ఖర్చులో సుమారు రూ.4 లక్షల కోట్లు (54 శాతం) వస్తువులు, రిటైల్ కొనుగోళ్ల ద్వారా సమకూరనుండగా.. సర్వీసుల రంగం రూ.3.45 లక్షల కోట్ల వాటాను దక్కించుకోనుంది. వినియోగ వ్యయంలో సింహభాగం ఆభరణాలు, దుస్తులదే కానుంది. బంగారం, వజ్రాభరణాల కొనుగోళ్లు రూ.1.2 లక్షల కోట్లకు చేరనుండగా, వస్త్ర శ్రేణి రూ.90,000 కోట్ల వాటాతో తర్వాతి స్థానంలో నిలిచింది. గిఫ్ట్‌లు, ఎలక్ట్రానిక్స్, ఫర్నిచర్, స్వీట్లు కూడా భారీగా అమ్ముడుపోనున్నాయి. సేవల విభాగంలో క్యాటరింగ్ రంగానికి రూ.75,000 కోట్లు, కల్యాణ మండపాలు, బాంక్వెట్ హాళ్లు, హోటళ్లకు మరో రూ.60,000 కోట్ల వ్యాపారం సమకూరనుంది. గత కొన్నేళ్లుగా వివాహ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తోంది. 2022లో రూ.3.75 లక్షల కోట్లుగా ఉన్న ఈ మార్కెట్ పరిమాణం ఏటేటా పెరుగుతూ ఈ ఏడాది రూ.7.50 లక్షల కోట్ల రికార్డు స్థాయికి చేరింది. అంతేకాకుండా, ఈ సీజన్ ద్వారా దాదాపు 1.25 కోట్ల మందికి తాత్కాలిక, పార్ట్‌టైమ్ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఆ బగ్ వల్లే అంత గందరగోళం..
మైక్రోసాఫ్ట్ వైఫల్యాన్ని ఒప్పుకున్న సత్య నాదెళ్ల

మైక్రోసాఫ్ట్ సేవల్లో అంతరాయంపై సీఈవో సత్య నాదెళ్ల విచారం
సమస్యను ముందే నివారించడంలో మరింత మెరుగ్గా ఉండాల్సిందన్న నాదెళ్ల
నిద్రాణంగా ఉన్న సాఫ్ట్‌వేర్ బగ్, భారీ ట్రాఫిక్ వల్లే సమస్య తలెత్తినట్లు వెల్లడి
టెస్టింగ్ దశలోనే లోపాన్ని గుర్తించి ఉండాల్సిందని నాదెళ్ల అంగీకారం
జెట్‌లుక్, టీమ్స్, కోపైలట్, ఎంఎస్ 365 సేవలు దాదాపు రోజంతా స్తంభన



ఇటీవల మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవల్లో తలెత్తిన భారీ ప్రపంచవ్యాప్త అంతరాయంపై ఆ సంస్థ సీఈవో సత్య నాదెళ్ల విచారం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ స్థాయిలో యూజర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఈ సమస్యను ముందే నివారించడంలో తాము మరింత మెరుగ్గా పనిచేసి ఉండాల్సిందని ఆయన అంగీకరించారు. సీఎన్‌బీసీతో మాట్లాడిన ఆయన.. సాఫ్ట్‌వేర్‌లో నిద్రాణంగా ఉన్న ఒక బగ్ ఒక్కసారిగా నిర్దిష్ట యూజర్ ట్రాఫిక్‌ను ఎదుర్కోవడంతోనే ఈ వ్యవస్థ కుప్పకూలిందని స్పష్టం చేశారు. టెస్టింగ్ ప్రక్రియలోనే ఇలాంటి లోపాలను గుర్తించడంలో విఫలమయ్యామని, ఒక చిన్న లోపం ప్రపంచవ్యాప్తంగా వ్యాపించకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు తీసుకుని ఉండాల్సిందని నాదెళ్ల పేర్కొన్నారు. గత వారం తొలుత జెట్‌లుక్‌లో మొదలైన ఈ అంతరాయం.. ఆ తర్వాత క్రమంగా టీమ్స్, కోపైలట్, మైక్రోసాఫ్ట్ 365, షేర్‌పాయింట్, వన్‌డ్రైవ్ వంటి కీలక సేవలన్నింటికీ పాకింది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది వినియోగదారులు దాదాపు ఒక రోజుకు పైగా సేవలందక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రాథమిక నివేదికల ప్రకారం ఈ ఏడాది మొదట్లోనే సిస్టమ్‌లోకి ప్రవేశించిన ఈ సాఫ్ట్‌వేర్ బగ్‌తో పాటు, విపరీతమైన ట్రాఫిక్, సర్వర్ సామర్థ్యం తగ్గడం వల్ల ఈ సమస్య ఏర్పడిందని తేలింది. అయితే దీని వెనుక ఎలాంటి సైబర్ దాడి ఆనవాళ్లు లేవని సంస్థ స్పష్టం చేసింది. ఈ పరిణామం మొత్తం టెక్ పరిశ్రమ ఎదుర్కొంటున్న విస్తృత సవాలును ప్రతిబింబిస్తోందని నాదెళ్ల విశ్లేషించారు. కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ద్వారా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, లోపాల గుర్తింపు వేగవంతమైనప్పటికీ.. ఆ ప్యాచ్‌లను అంతే వేగంగా పాత సాంకేతిక వాతావరణంలోకి చేర్చడం ఆపరేషనల్ రిస్క్‌లకు దారితీస్తోందని ఆయన హెచ్చరించారు. కొత్త అప్‌డేట్‌లను పాత వ్యవస్థలు తట్టుకోలేకపోవడం వల్ల ఇలాంటి అనుకోని సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు.

తొలి రోజే న్యూజిలాండ్ రివర్స్ ఎటాక్
బుమ్రా దెబ్బకొట్టినా నిలబడ్డ కివీస్ మిడిలార్డర్!

తొలి రోజు ఆట ముగిసేసరికి న్యూజిలాండ్ స్కోరు 243/5
నికోల్స్ 113 నాటౌట్, ఫిలిప్స్ 94 నాటౌట్‌గా క్రీజులో
ఆరో వికెట్‌కు అజేయంగా 173 పరుగులు రాబట్టిన జోడి
70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన కివీస్‌ను ఆదుకున్న బ్యాటర్లు
బేసిన్ రిజర్వ్‌లో నికోల్స్‌కు ఇది ఐదో టెస్టు శతకం



బేసిన్ రిజర్వ్ వేదికగా భారత్‌తో ప్రారంభమైన తొలి టెస్టులో హెన్రీ నికోల్స్ అజేయ సెంచరీ, గ్లెన్ ఫిలిప్స్ మెరుపు బ్యాటింగ్‌తో న్యూజిలాండ్ పటిష్ఠ స్థితికి చేరుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేపట్టిన కివీస్ జట్టు ఓ దశలో భారత పేసర్ల ధాటికి 70 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో నికోల్స్, ఫిలిప్స్ జోడి తిరుగులేని పోరాట పటిమను కనబరిచి అజేయంగా 173 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆతిథ్య జట్టు 82 ఓవర్లలో 5 వికెట్లకు 243 పరుగులు చేసింది. నికోల్స్ 221 బంతుల్లో అజేయంగా 113 పరుగులు సాధించాడు. ఈ మైదానంలో ఆడిన 15 ఇన్నింగ్స్‌లలో అతనికిది ఐదో టెస్టు సెంచరీ కావడం విశేషం. మరోవైపు ఫిలిప్స్ 182 బంతుల్లో 94 పరుగులతో నాటౌట్‌గా నిలిచి త్రుటిలో శతకం చేజార్చుకునే పరిస్థితికి చేరినా, క్రీజులో పాతుకుపోయాడు. వీరిద్దరూ ఆఖరి సెషన్‌లో వికెట్ పడకుండా 100కు పైగా పరుగులు జోడించి భారత బౌలర్లపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. వ్యక్తిగత స్కోరు 102 వద్ద నికోల్స్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ సమన్వయ లోపంతో నేలపాలు చేసి లైఫ్ ఇచ్చారు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా 17 ఓవర్లలో 52 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టగా, అన్షుల్ కాంబోజ్ ఒక వికెట్, ఆకాశ్ దీప్ ఒక వికెట్ తీశారు. టామ్ బ్లండెల్ వికెట్‌ను కాంబోజ్ తీసినప్పటికీ, ఆ తర్వాత భారత బౌలర్లు కివీస్ జోడీని విడదీయలేకపోయారు. వాషింగ్టన్ సుందర్, ప్రసిద్ధ్ కృష్ణ వికెట్లు తీయడంలో విఫలమయ్యారు. ప్రారంభంలో పైచేయి సాధించిన భారత్‌ను నికోల్స్, ఫిలిప్స్ దెబ్బకొట్టడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి మ్యాచ్ ఆసక్తికరంగా మారింది.

సిరాజ్‌ను అందుకే తుది జట్టు నుంచి తప్పించాం..
కోచ్ కోటక్ వివరణ!

సిరాజ్‌ను పక్కనపెట్టడం ఏమాత్రం తప్పు కాదన్న అసిస్టెంట్ కోచ్ కోటక్
పిచ్ పరిస్థితులు, ఐదు రోజుల ఆటను దృష్టిలో ఉంచుకునే జట్టు ఎంపిక
సిరాజ్ ప్రపంచ స్థాయి బౌలరే అయినా పరిస్థితుల కోసమే తప్పించామని వెల్లడి
గడ్డి పిచ్‌పై ఇద్దరు సీమ్, ఇద్దరు స్పింగ్ పేసర్లతో బరిలోకి దిగిన భారత్
కివీస్ టాప్ ఆర్డర్‌లో నలుగురు లెఫ్ట్‌హ్యాండర్లు ఉండటంతో సుందర్‌కు చోటు



న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లోని బేసిన్ రిజర్వ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్టులో స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను తుది జట్టు నుంచి తప్పించడంపై టీమిండియా అసిస్టెంట్ కోచ్ సితాన్షు కోటక్ స్పష్టతనిచ్చాడు. సిరాజ్ ప్రపంచ స్థాయి బౌలర్ అయినప్పటికీ, పిచ్ పరిస్థితులకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నామన్నాడు. ఇందులో ఎలాంటి తప్పిదం లేదని అతడు గట్టిగా సమర్థించుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన కోటక్.. పేసర్ల ఎంపిక, జట్టు కూర్పు వెనుక ఉన్న వ్యూహాలను వివరించాడు. అనుభవజ్ఞుడైన సిరాజ్‌ను ఈ మ్యాచ్‌లో పక్కనపెట్టడం తప్పు కాదని కోటక్ స్పష్టం చేశారు. "నా దృష్టిలో ఇది ఏమాత్రం తప్పుడు నిర్ణయం కాదు. జట్టు యాజమాన్యం పిచ్ పరిస్థితులు, ప్రత్యర్థి బలాబలాలను అంచనా వేసి అత్యుత్తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను బరిలోకి దించింది. ఇటీవల సిరాజ్ శ్రీలంకలో ఆడిన పరిస్థితులు వేరు, ఇక్కడి పరిస్థితులు వేరు. సిరాజ్‌కు ఎలాంటి సమస్యా లేదు. ఇది కేవలం పరిస్థితుల ఆధారంగా తీసుకున్న నిర్ణయం మాత్రమే" అని పేర్కొన్నారు. బేసిన్ రిజర్వ్ పిచ్‌పై దట్టమైన గడ్డి ఉండటం వల్ల వేగం, సీమ్, స్వింగ్ రాబట్టగల కాంబినేషన్‌కు ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. ఇద్దరు సీమ్ బౌలర్లు, ఇద్దరు స్పింగ్ బౌలర్లు అవసరమనే ఉద్దేశంతోనే ఈ పేస్ దాడిని ఎంచుకున్నామన్నారు. కేవలం తొలి రోజు మాత్రమే కాకుండా ఐదు రోజుల ఆటను దృష్టిలో పెట్టుకుని బౌలర్లను ఎంపిక చేశామని వివరించారు. యువ పేసర్ అన్షుల్ కాంబోజ్ వేగం తగ్గడంపై స్పందిస్తూ.. మూడో స్పెల్‌లో కాస్త వేగం తగ్గినా ఆరంభంలో మంచి వేగంతోనే బౌలింగ్ చేశాడని కోటక్ వెనకేసుకొచ్చారు.

స్పోర్ట్స్

'టైమ్ 100 నెక్స్ట్-ఇండియా'
జాబితాలో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ

మారుతున్న భారతదేశానికి వైభవ్ ప్రతీక అంటూ ఆయుష్మాన్ ప్రశంసలు
విభిన్నంగా ఆలోచించేవారికే భవిష్యత్తు సొంతమని పేర్కొన్న నటుడు
జాబితాలో నిలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్, చెస్ ఛాంపియన్ డి.గుకేశ్
క్రీడాకారులు సానియా మీర్జా, లవ్లీనా, మీరాబాయి చానులకు సైతం స్థానం
దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే 100 మందితో కూడిన ప్రత్యేక జాబితా



భారత క్రికెట్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపును దక్కించుకున్నాడు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న 100 మంది అసాధారణ యువ నాయకులు, ఎదుగుతున్న ప్రతిభావంతులతో ప్రతిష్ఠాత్మక 'టైమ్' పత్రిక రూపొందించిన తొలి 'టైమ్ 100 నెక్స్ట్ – ఇండియా' జాబితాలో వైభవ్‌కు చోటు దక్కింది. ఈ సందర్భంగా ప్రముఖ బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా యువ బ్యాటర్‌ను ఆకాశానికెత్తుతూ ఒక ప్రత్యేకమైన నోట్‌ను రాశారు. వైభవ్ మారుతున్న నవ భారతానికి అసలైన ప్రతీక అని కొనియాడారు. మైదానంలో బ్యాట్ పట్టుకుని వైభవ్ బంతిని బాదుతున్నప్పుడు, విభిన్నంగా ఆలోచించే వారికే భవిష్యత్తు సొంతమని గుర్తుచేస్తాడని ఆయుష్మాన్ పేర్కొన్నారు. అతడు కేవలం క్రీడా విస్మయం మాత్రమే కాదని, అంతకుమించి ఎంతో విశిష్టమైన వ్యక్తిత్వమని ప్రశంసించారు. కేవలం 14 ఏళ్ల వయసులోనే ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడని, ఏడాది వ్యవధిలోనే రికార్డు స్థాయి ప్రదర్శనలతో దూసుకుపోతున్నాడని గుర్తుచేశారు. ప్రతిభ అనేది ఎక్కడి నుంచైనా పుట్టుకొస్తుందని చెప్పడానికి వైభవ్ ప్రయాణమే నిదర్శనమని, అతడి విజయాలు కోట్ల మంది భారతీయులకు పెద్ద కలలు కనే ధైర్యాన్ని ఇస్తాయని ఆయుష్మాన్ కొనియాడారు. అతడి అసలైన విజయం పరుగులు చేయడంలో మాత్రమే కాదని, అసాధారణ స్థాయికి ఎదిగే స్వేచ్ఛ దొరికినప్పుడు ఏం జరుగుతుందో చూపించాడని వ్యాఖ్యానించారు. ఈ ప్రతిష్ఠాత్మక జాబితాలో వైభవ్‌తో పాటు భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, బాక్సర్ లవ్లీనా బోర్గొహైన్, వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను, ప్రపంచ చెస్ ఛాంపియన్ డి. గుకేశ్, మాజీ టెన్నిస్ స్టార్ సానియా మీర్జా, భారత మహిళా హాకీ జట్టు గోల్‌కీపర్ సవితా పునియా, ఆసియా క్రీడల

AKSHARA SAAVAL PRINTED PUBLISHED EDITED AND OWNED BY BADAVATH BALAJI PRINTED AT H.NO.-1-9-1296/5/B/A/1, NEW SHAYAMPET, KAZIPET MANDAL, HANUMAKONDA, TELANGANA-506001,EDITOR B.BALAJI CELL:8096677136 H.NO.-45/12/151, INDIRA NAGAR, MANDAL GEESUGONDA, WARANGAL TELANGANA-506013_ **RNI** :TEL TEL / 2023/ 84132